JAYABHERIDAILY.COM

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రభాత జయభేరి

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

మేడ్చల్ - మల్కాజిగిరి । బుధవారం 22-04-2026

Medchal - Malkajgiri । Wednesday 22-04-2026

Follow: jayabherinews

సంపుటి : 02 । సంచిక : 325

పేజీలు : 8 । వెల : 5

Vol. 02 । Issue 325 । Pages : 8 । ₹: 5



# అపర చాణక్యుడు మళ్లీ రంగంలోకి


- ఈనెల 27న తెలంగాణ భవన్‌లో కేసీఆర్ మీటింగ్
- బీఆర్ఎస్ రజతోత్సవాల ముగింపు సందర్భంగా సమావేశం
- భవిష్యత్ కార్యాచరణపై ప్రకటన చేసే అవకాశం

**జయభేరి, హైదరాబాద్:**

తెలంగాణ రాజకీయ యవనికపై తనదైన ముద్ర వేసిన అపర చాణక్యుడు, బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్ రావు మళ్లీ యాక్షన్ మోడ్‌లోకి వచ్చారు. గత కొన్ని నెలలుగా రాజకీయ పరిణామాలను మౌనంగా గమనిస్తూ, వ్యూహాత్మక విరామం తీసుకున్న గులాబీ బాస్, ఇప్పుడు ఒక్కసారిగా తన దూకుడును పెంచారు. పార్టీ స్థాపించి 25 వసంతాలు పూర్తి చేసుకుంటున్న తరుణంలో, రజతోత్సవ వేడుకల ముగింపును ఒక చారిత్రాత్మక వేదికగా మార్చుకోవాలని ఆయన సంకల్పించారు. ఈ నేపథ్యంలోనే, ఏప్రిల్ 27వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయం 'తెలంగాణ భవన్'లో అత్యంత కీలకమైన రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశం కేవలం ఒక ఉత్సవంలా కాకుండా, పార్టీ మనుగడను, భవిష్యత్ దిశానిర్దేశాన్ని నిర్ణయించే ఒక మేధోమధన సదస్సుగా ఉండబోతోంది. అధికారం కోల్పోయిన తర్వాత క్యాడర్‌లో నెలకొన్న నైరాశ్యాన్ని తొలగించి, వారిలో పోరాట పటిమను నింపడమే కేసీఆర్ ప్రధాన లక్ష్యం. ముఖ్యంగా పార్టీ సంస్థాగత నిర్మాణంలో భారీ మార్పులు చేసేందుకు ఆయన సిద్ధమయ్యారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కమిటీలను పునర్నిర్మించడం, క్రియాశీలక సభ్యత్వ నమోదు ప్రక్రియను డిజిటల్ పద్ధతిలో వేగవంతం చేయడం వంటి అంశాలపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించనున్నారు. సభ్యత్వ నమోదు ద్వారా పార్టీకి ఆర్థిక పరిపుష్టితో పాటు, క్షేత్రస్థాయిలో బలాబలాలను అంచనా వేయవచ్చని ఆయన భావిస్తున్నారు.

...మిగతాది 2 లో

మాజీ సీఎం కేసీఆర్ మరోసారి బయటికి రానున్నారు. ఈనెల 27న బీఆర్ఎస్ రజతోత్సవాల ముగింపు సందర్భంగా తెలంగాణ భవన్‌లో కీలక సమావేశం నిర్వహించనున్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణంతోపాటు భవిష్యత్ కార్యాచరణకు సంబంధించి కీలక ప్రకటన చేస్తారని గులాబీ శ్రేణులు భావిస్తున్నాయి. ఇటీవలి జగిత్యాల సభ సక్సెస్ కావడంతో దీనికి అనుగుణంగా మరిన్ని సభలు, సమావేశాలు చేపట్టి.. అధికార కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ఎండగట్టాలని పార్టీ వర్గాలు అధిష్ఠానానికి విజ్ఞప్తులు చేస్తున్నాయి.




# ఉప్పల్‌లో అభిషేక్ సునామీ శతకం

- తుఫాన్ సెంచరీతో కాటేరమ్మ కొడుకు బీభత్సం
- 9 సిక్స్‌లు, 7 ఫోర్లు.. 47 బంతుల్లోనే అజేయ శతకం
- 2000 పరుగుల మైలురాయి.. దిగ్గజాల సరసన అభిషేక్

అభిషేక్ శర్మ 15వ ఓవర్‌లో తన సెంచరీని పూర్తి చేశాడు. నితీష్ రాణా వేసిన మొదటి రెండు బంతుల్లో వరుసగా రెండు సిక్సర్లు కొట్టి, అతను 47 బంతుల్లో తన సెంచరీని పూర్తి చేశాడు. ఇది అతనికి రెండవ ఐపీఎల్ సెంచరీ, దీంతో టీ20 క్రికెట్‌లో అతని సెంచరీల సంఖ్య తొమ్మిదికి చేరింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ యువ సంచలనం అభిషేక్ శర్మ ఐపీఎల్ 2026లో మరోసారి తన బ్యాట్‌కు పనిచెప్పాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన కీలక పోరులో అద్భుత శతకంతో చెలరేగడమే కాకుండా వ్యక్తిగత రికార్డులను తిరగరాశాడు. ప్రపంచ కప్ వైఫల్యాలను మరచి,

...మిగతాది 2 లో

## తమిళనాడు అభివృద్ధి కోరుకునే ప్రతీ ఒక్కరూ ఎన్డీఏకు ఓటు వేయండి



- ఏపీ తమిళనాడు ప్రజలది అన్నదమ్ముల అనుబంధం
- డీ లిమిటేషన్ బిల్లుతో దక్షిణాదికి వచ్చే నష్టమేమీ లేదు
- సీఎం చంద్రబాబు నాయుడు

**జయభేరి, చెన్నై:**

'తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా చెన్నైకి ఎన్టీఆర్ తాగునీరు ఇచ్చారు.తిరువళ్ళూర్ నుంచి అబ్దుల్ కలాం వరకు ఎంతో మంది ప్రముఖులు ఈ గడ్డ నుంచి వచ్చారు. తమిళనాడుకు చెందిన ఎంతో మంది ఉన్నతాధికారులు దేశానికి సేవ చేశారు, చేస్తున్నారు'అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమిళనాడులో రెండో రోజు ఎన్నికల ప్రచారం చేపట్టారు. మంగళవారం

...మిగతాది 2 లో



# ఢిల్లీ టూర్‌పై క్లారిటీ

- సీఎం రేవంత్‌పై హరీశ్ రావు ఫైర్

**జయభేరి, హైదరాబాద్:**

తెలంగాణ రాజకీయాల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య మాటల యుద్ధం ముదిరింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ కీలక నేత హరీష్ రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యంగా జగిత్యాల సభలో కేసీఆర్ చేసిన ప్రసంగంపై ముఖ్యమంత్రి

...మిగతాది 2 లో

# జీవన్ రెడ్డి యువకుడైతే నిరుద్యోగ యువత గతేంటి?

- తెలంగాణలో ఉన్న యూత్ అంతా సచ్చిపోయిన్రా.. బతికున్నరా..?
- వాళ్ల ఫ్యూచర్ ఏంది..? వాళ్ల కథేంది అనేది నాకైతే అర్థం కాలేదు
- కేసీఆర్‌పై కవిత సెటైర్లు

**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 21 :**



రాష్ట్రంలో ఎండల తీవ్రతతో పాటు రాజకీయ సెగలు కూడా తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. సోమవారం జగిత్యాల వేదికగా బీఆర్ఎస్ నిర్వహించిన భారీ బహిరంగ సభపై జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సెటైర్లు వేశారు. జీవన్ రెడ్డిని ఉద్దేశించి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆమె ఘాటుగా స్పందించారు. జీవన్ రెడ్డిని 75 ఏళ్ల నవ యువకుడిగా అభివర్ణించడాన్ని ఆమె ఎద్దేవా చేశారు. జీవన్ రెడ్డి తెలంగాణ వ్యతిరేకి అని అలాంటి వ్యక్తిని పార్టీలో చేర్చుకొని ఏం సందేశం ఇచ్చారని ప్రశ్నించారు. హీట్ సమ్మర్‌లో తెలంగాణ రాజకీయాలు హాట్ హాట్‌గా మారాయి. సోమవారం జగిత్యాలలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయగా.. భూపాలపల్లి జిల్లాలో అధికార కాంగ్రెస్ సభను నిర్వహించింది. జగిత్యాలలో సీనియర్ నేత జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా నిర్వహించిన సభపై జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఘాటుగా స్పందించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జీవన్ రెడ్డిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను తప్పుబడుతూ ఆమె సెటైర్లు వేశారు. 75 ఏళ్లు వచ్చిన వ్యక్తిని నవ యువకుడిగా అభివర్ణిస్తే.. రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగ యువకులు ఏమవ్వాలి? అని కవిత ప్రశ్నించారు. యువత ఆకాంక్షలను గుర్తించడంలో బీఆర్ఎస్ పూర్తిగా విఫలమైందని ఆమె ఆరోపించారు. కేసీఆర్ తన సభలో ప్రజలకు 'ఉట్టి కథలు' చెప్పారని అన్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించి ప్రజలు తప్పు చేశారని అనడం కేసీఆర్ అహంకారానికి నిదర్శనమని ప్రజల తీర్పును గౌరవించాల్సింది పోయి వారిని తప్పుబట్టడం సరికాదని ఆమె మండిపడ్డారు. 'బీఆర్ఎస్ పార్టీ ఉట్టి కథలు చెప్పింది. కాంగ్రెస్ పార్టీనేమో పిట్ట కథలు చెప్పింది. ప్రజల కష్టాలను మాత్రం ఎవరూ చెప్పలేదు. జగిత్యాలలో 75 ఏళ్ల కురువృద్ధుడిని పార్టీలో

...మిగతాది 2 లో

# బస్సులు బంద్!




- చర్చలు విఫలం..

**జయభేరి, హైదరాబాద్:**

టీజీఎస్ఆర్టీసీ జేఏసీ నేతలతో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన చర్చలు విఫలం అయ్యాయి. దీంతో ఇవాళ అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ బస్సులు నిలిచిపోనున్నాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడనున్నారు. బుధవారం ఉదయం షిఫ్ట్ నుంచే కార్మికులు విధులు బహిష్కరించనున్నారు. దీంతో అర్ధరాత్రి నుంచి బస్సులు పూర్తిగా నిలిచిపోనున్నాయి. వేతన సవరణ, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ వంటి అంశాలపై ప్రభుత్వాన్ని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

...మిగతాది 2 లో

▸▸ మొదటిపేజీ తరువాయి

## అపర చాణక్యుడు మళ్లీ రంగంలోకి

పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ సమావేశం ప్రాముఖ్యతను వివరిస్తూ, గత పదేళ్లలో పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన ప్రతి ఒక్కరినీ గౌరవించుకోవాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. ఈ సమావేశానికి కేవలం ప్రస్తుత ప్రజాప్రతినిధులే కాకుండా, పార్టీకి వెన్నెముకగా నిలిచిన మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్సీలతో పాటు గతంలో వివిధ కార్పొరేషన్లు మరియు జిల్లా పరిషత్ చైర్మన్లుగా పనిచేసిన వారందరినీ ప్రత్యేకంగా ఆహ్వానించారు. పాత, కొత్త తరం నాయకులను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా పార్టీలో ఎటువంటి విభేదాలు లేవని, అందరం కలిసికట్టుగా పోరాడతామనే బలమైన సంకేతాన్ని ప్రజల్లోకి పంపాలని కేసీఆర్ యోచిస్తున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, ప్రజల్లో ఉన్న అసంతృప్తిని ఎలా అనుకూలంగా మార్చుకోవాలనే అంశంపై కేసీఆర్ ఈ సమావేశంలో పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ లేదా వివరణాత్మక ప్రసంగం చేసే అవకాశం ఉంది. రైతు రుణమాఫీ, సాగునీటి కష్టాలు, నిరుద్యోగ భృతి వంటి ప్రజా సమస్యలపై బిఆర్ఎస్ శ్రేణులు ఏ విధంగా పోరాడాలి? సోషల్ మీడియా వేదికగా ప్రత్యర్థుల విమర్శలను ఎలా తిప్పికొట్టాలి? అనే విషయాలపై క్యాడర్‌కు ఆయన శిక్షణ ఇవ్వనున్నారు. ఈ భేటీ తర్వాత కేసీఆర్ స్వయంగా జిల్లాల పర్యటనలకు శ్రీకారం చుట్టే అవకాశం ఉందన్న వార్తలు పార్టీ వర్గాల్లో జోరుగా వినిపిస్తున్నాయి. మొత్తానికి ఏప్రిల్ 27న జరిగే ఈ భేటీ తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులకు నాంది పలకబోతోంది. తన రాజకీయ ప్రస్థానంలో ఎన్నో ఎత్తుపల్లాలను చూసిన కేసీఆర్, ఈ రజతోత్సవ వేళ పార్టీని మళ్లీ ఏ విధంగా అగ్రస్థానంలో నిలబెడతారనేది ఆసక్తికరంగా మారింది. తెలంగాణ భవన్‌లో జరిగే ఈ చర్చలు, అక్కడ కేసీఆర్ చేసే ప్రసంగం రాష్ట్ర రాజకీయాల్లో రాబోయే రోజుల్లో ఎలాంటి ప్రకంపనలు సృష్టిస్తాయో వేచి చూడాలి.

## ఉప్పల్‌లో అభిషేక్ సునామీ శతకం

లీగ్ క్రికెట్‌లో తన సత్తా ఏంటో ఈ ఇన్నింగ్స్‌తో మరోసారి నిరూపించుకున్నాడు. ఇటీవల జరిగిన ప్రపంచ కప్ పోటీలలో అభిషేక్ శర్మ తీవ్ర ఒత్తిడికి లోనై వరుసగా మూడు సార్లు సున్నా పరుగులకే అవుట్ అయ్యాడు. ఆ సమయంలో విమర్శలు ఎదుర్కొన్న ఈ యువ ఆటగాడు, ఐపీఎల్ వేదికగా అద్భుత పునరాగమనం చేశాడు. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ మైదానంలో ఢిల్లీ బౌలర్లను ముప్పుతిప్పలు పెడుతూ మైదానం నలుమూలలా బౌండరీల వర్షం కురిపించాడు. ప్రారంభంలో కాస్త నెమ్మదిగా ఆడినా, ఒక్కసారి కుదురుకున్నాక తన అసలుసిసలు విశ్వరూపాన్ని ప్రదర్శించాడు.

సాధారణంగా మెరుపు వేగంతో ఆడే అభిషేక్, ఈ మ్యాచ్‌లో 25 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత మరింత దూకుడు పెంచి కేవలం 47 బంతుల్లోనే తన కెరీర్‌లో రెండో ఐపీఎల్ శతకాన్ని నమోదు చేశాడు. ఢిల్లీ బౌలింగ్ దాడిని సమర్థవంతంగా ఎదుర్కొంటూ, పరుగుల వరద పారించాడు. ఈ శతకంతో ఐపీఎల్ చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నాడు.

**2000 పరుగుల మైలురాయి.. దిగ్గజాల సరసన అభిషేక్..**

ఈ మ్యాచ్‌లో 59 పరుగుల వద్దకు చేరుకోగానే అభిషేక్ శర్మ సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున 2000 పరుగుల మైలురాయిని అధిగమించాడు. ఈ ఘనత సాధించిన నాలుగో ఆటగాడిగా ఆయన రికార్డు సృష్టించాడు. గతంలో డేవిడ్ వార్నర్, శిఖర్ ధావన్, కేన్ విలియమ్సన్ వంటి మేటి ఆటగాళ్లు మాత్రమే ఈ మైలురాయిని అందుకున్నారు. విశేషమేమిటంటే, శిఖర్ ధావన్ తర్వాత ఈ ఘనత సాధించిన రెండో భారతీయ ఆటగాడు అభిషేక్ శర్మ కావడం గమనార్హం.

**ఐపీఎల్‌లో ఎస్ఆర్‌హెచ్ తరపున అత్యధిక పరుగులు..**

డేవిడ్ వార్నర్ (4014 పరుగులు), శిఖర్ ధావన్ (2768 పరుగులు), కేన్ విలియమ్సన్ (2101 పరుగులు), అభిషేక్ శర్మ (2000*), ఐపీఎల్‌లో ఎస్ఆర్‌హెచ్ తరపున అత్యధిక 50+ స్కోర్లు, 42 - డేవిడ్ వార్నర్, 19 - శిఖర్ ధావన్, 18 - కేన్ విలియమ్సన్, 13* - అభిషేక్ శర్మ*, 12 - హెన్రిచ్ క్లాసెన్, మనీష్ పాండే అలాగే, 50 కంటే ఎక్కువ పరుగులు చేసిన సందర్భాల్లోనూ అభిషేక్ (13 సార్లు) నాలుగో స్థానానికి చేరుకున్నాడు. హెన్రిచ్ క్లాసెన్, మనీష్ పాండే వంటి అనుభవజ్ఞులను వెనక్కి నెట్టి ఈ యువ కిశోరం దూసుకుపోతోంది. ఈ ఇన్నింగ్స్ సన్‌రైజర్స్ అభిమానులలో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

## ఎన్డీఏకు ఓటు వేయండి

విరుధ్ నగర్ జిల్లాలో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో ఉదయం 11 గంటలకు చెన్నైలో కేంద్ర రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి సీఎం చంద్రబాబు నాయుడు మీడియా సమావేశం నిర్వహించారు. 'తమిళ ప్రజలకు వారి భాష అంటే ఎంతో ప్రేమ.కష్టించి పని చేసే మనస్తత్వం వారికే సొంతం అని సీఎం చంద్రబాబు నాయుడు కొనియాడారు.

ఏపీ తమిళనాడు రాష్ట్రాల ప్రజలది అన్నదమ్ముల బంధం అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.'ఘనమైన వారసత్వం, సంపద కలిగిన రాష్ట్రం తమిళనాడు అని కొనియాడారు. మన దేశానికి ఓ సంస్కరణ వాదిగా ప్రధాని నరేంద్రమోడీ ఉన్నారని చెప్పుకొచ్చారు. రాష్ట్రాల మధ్య అభివృద్ధి పోటీ ఉంది. దీనికి కేంద్ర ప్రోత్సాహం కూడా ఉంది అని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పుకొచ్చారు.'మహిళా రిజర్వేషన్ బిల్లుపై కేంద్రాన్ని ఓడించామని కాంగ్రెస్, డీఎంకే అంటున్నాయి. కానీ వారు మహిళలను ఓడించారు. నియోజకవర్గాల పునర్విభజన ద్వారా దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం లేదు. కొత్త సెన్సస్ ప్రకారం అయితే దక్షిణాది నష్టపోవాల్సి వచ్చేది. ప్రస్తుతం ఉన్న సీట్లపై 50 శాతం అదనంగా సీట్ల సంఖ్య పెరిగితే దానిపై మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు వచ్చేవి. దీనికన్నా మంచి ఫార్ములా మరొకటి ఉంటుందా..?'అని సీఎం చంద్రబాబు నాయుడు ప్రశ్నించారు.

**డీ లిమిటేషన్ బిల్లుతో దక్షిణాదికి వచ్చే నష్టమేమీ లేదు**

'మహిళలకు, పురుషులకు దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టమూ లేదు. బిల్లులను అడ్డుకున్న రాహుల్ గాంధీ, స్టాలిన్‌లు ఏం సాధించారు'అని సీఎం చంద్రబాబు నాయుడు నిలదీశారు.'నేను దక్షిణాది రాష్ట్రాల వైపే మాట్లాడుతున్నాను. జాతీయ ప్రయోజనాలతో పని చేస్తున్న ప్రధాని నరేంద్రమోడీకి మేం పూర్తి మద్దతు ఇస్తున్నాం'అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. 'తమిళనాడులో అభివృద్ధి ఆగింది. చెన్నై లాంటి నగరాల నుంచి ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు.శాంతి భద్రతలు, మహిళలపై నేరాలు, కస్టోడియల్ మరణాలు, డ్రగ్స్ పెరిగాయి. చెన్నై రైల్వే స్టేషన్ ఆధునీకరణకు పెద్ద ఎత్తున నిధులు ఇచ్చారు'అని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పుకొచ్చారు. త్వరలో చెన్నై బెంగుళూరు అమరావతి లాంటి నగరాలను అనుసంధానించేలా హై స్పీడ్ రైలు కారిడార్‌ను కేంద్రం ఆమోదించింది అని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పుకొచ్చారు.ఇకపోతే తొలి రోజు కోయంబత్తూర్, తళి, అన్నానగర్ నియోజకవర్గాల్లో సీఎం చంద్రబాబు నాయుడు పర్యటించారు. మొదటి రోజు పర్యటనలో భాగంగా కోయంబత్తూరు నార్త్, కోయంబత్తూరు సౌత్, సింగనల్లూర్, కౌండం పాలాయం, సూలూర్, తళి, అన్నా నగర్, టీ నగర్, విల్లి వాక్కం అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్డీఏ అభ్యర్థుల సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

## బల పడిన రూపాయి

అంతర్జాతీయ మార్కెట్లలో డాలర్తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ ట్రేడింగ్లో బలపడింది. ప్రభుత్వ రంగ చమురు శుద్ధి సంస్థలకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇచ్చిన ఓ కీలక ఆదేశం ఇందుకు ప్రధాన కారణంగా నిలిచింది. డాలర్లను నేరుగా కొనుగోలు చేయడానికి బదులుగా ప్రత్యేక క్రెడిట్ లైన్ను ఉపయోగించుకోవాలని ఆర్బీఐ సూచించడంతో డాలర్లకు డిమాండ్ తగ్గి రూపాయిపై ఒత్తిడి తగ్గింది.గత సెషన్లో 93.20 వద్ద ముగిసిన రూపాయి.. ట్రేడింగ్లో 25 పైసలు లాభపడి 92.95 వద్ద కొనసాగుతోంది. దేశీయ ఈక్విటీ మార్కెట్లలో సానుకూల సెంటిమెంట్, ఇజ్రాయెల్‌లెబనాన్ మధ్య కాల్పుల విరమణ వార్తలు, అమెరికాఇరాన్ చర్చలలో పురోగతి అంచనాలు కూడా రూపాయికి మద్దతునిచ్చాయి. అయితే, ప్రపంచ మార్కెట్లలో డాలర్ బలంగా ఉండటం రూపాయి లాభాలను కొంతమేర పరిమితం చేస్తోంది.

# ఐటీ ఉద్యోగుల మెడపై ఏఐ కత్తి..
# మరో 3 లక్షల మంది ఔట్?

> "2026 తొలి త్రైమాసికంలో టెక్ రంగం తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కారణంగా ఈ 2026 మొదటి మూడు నెలల్లోనే 73 వేల మందికి పైగా టెకీలు ఉద్యోగాలు కోల్పోయారు. మెటా, ఒరాకిల్, స్నాప్ చాట్ వంటి దిగ్గజ కంపెనీలు భారీగా లేఆఫ్స్ చేశాయి. మెటా కంపెనీ ఇటీవలే 8 వేల మందిని తొలగిస్తున్నట్లు తెలిపింది.




ఏఐతో భర్తీ చేస్తూ ఖర్చులను తగ్గించుకునేందుకు కంపెనీలు ప్రయత్నాలు మొదలు పెట్టాయి. ఈ ఏడాది చివరి నాటికి 3 లక్షల మందికి ఉపాధి పోవచ్చనే అంచనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం అంటే ఒకప్పుడు యువత కలల జాబ్. కానీ ఇప్పుడు అంతా తారుమారు అయింది. ఐటీ ఉద్యోగం అంటే ఎప్పుడు ఊడిపోతుందో చెప్పలేని పరిస్థితి వచ్చింది. టెక్ రంగానికి 2026 సంవత్సరం ఒక పీడకలలా మారిపోతోంది. ఎందుకంటే గత మూడు నెలల్లోనే 95 కంపెనీలు 73,200 మందికి పైగా ఐటీ, టెక్ ఉద్యోగులను తొలగించాయి. ఇది ఇక్కడితోనే ఆగిపోయేలా కనిపించడం లేదు. ఏప్రిల్‌లో స్నాప్, ఒరాకిల్, డిస్నీ, మెటా వంటి ప్రపంచ స్థాయి టెక్ దిగ్గజాలు ఉద్యోగులను తొలగిస్తున్నాయి. ఈ ఏడాది 2026 చివరి నాటికి ఉద్యోగుల తొలగింపుల సంఖ్య 3 లక్షలకు చేరవచ్చనే అంచాలను ఆందోళన కలిగిస్తున్నాయి. ఒకప్పుడు కంపెనీలు వృద్ధి గురించి మాట్లాడితే కేవలం ఏఐ ఎఫిషియన్సీ జపం చేస్తున్నాయి.తమ ఉద్యోగులకు స్నాప్ సీఈఓ ఇవాన్ స్పీగెల్ పంపిన మెమోలో ఓ పచ్చి నిజాన్ని నివేదించారు. ఉద్యోగాల కోత కంపెనీకి ఒక అగ్ని పరీక్షగా అభివర్ణించారు. ఏఐ టూల్స్ తో తక్కువ మందితోనే ఎక్కువ పని చేయించవచ్చని, దీంతో ఏడాదికి 500 మిలియన్ డాలర్లు ఆదా అవుతాయని తెలిపారు. అంటే, మనుషుల కంటే మెషీన్ల ద్వారానే చౌకగా పనులు పూర్తి చేయవచ్చని టెక్ కంపెనీలు భావిస్తున్నాయని ఆయన మాటల్లో అర్థమవుతోంది.మరోవైపు.. టెక్ దిగ్గజం ఒరాకిల్ వ్యవహరించిన తీరు ప్రస్తుతం ఐటీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మార్చి 31న దాదాపు 30 వేల మంది ఉద్యోగులకు ఉదయం 6 గంటలకే టెర్మినేషన్ మెయిల్స్ పంపించి షాక్ ఇచ్చింది. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా ఈ భారీ కోతలు విధించడం గమనార్హం. కంపెనీ తన పెట్టుబడులను ఏఐ డేటా సెంటర్ల వైపు మళ్లించడమే ఇందుకు ప్రధాన కారణం. ఇక డిస్నీ కొత్త సీఈఓ జోష్ డి అమారో సైతం తన బాధ్యతలు చేపట్టిన ఒక్క నెలలోనే స్టూడియోలు, ఈఎస్‌పీఎన్ విభాగాల్లో ఉద్యోగుల తొలగింపులూ మొదలుపెట్టారు.నిజానికి చాలా కంపెనీలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల ఉద్యోగాలు పోతున్నాయని అంటున్నా ఇది కొంత వరకు ఖర్చుల కోత కోసం ఆడుతున్న నాటకం అని విశ్లేషకులు భావిస్తున్నారు. భవిష్యత్తులో ఉద్యోగాలు ఉండాలంటే ఏఐ టూల్స్‌పై పట్టు సాధించడం ఏకైక మార్గంగా చెబుతున్నారు. ఒకవైపు కంపెనీలు లేఆఫ్స్ ప్రకటిస్తూనే మరోవైపు వేల సంఖ్యలో ఉద్యోగ ప్రకటనలు చేస్తుండడం గమనార్హం. వీటిని ఘోస్ట్ జాబ్స్ గా చెబుతున్నారు. అంటే నిజానికి ఆ ఉద్యోగాలు భర్తీ చేయరని, కంపెనీ ఇంకా వృద్ధి చెందుతోందని ఇన్వెస్టర్లను నమ్మించేందుకు ఇలా చేస్తున్నారని ఐటీ విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారి. ఇది నిరుద్యోగులను తీవ్ర గందరగోళానికి గురిచేస్తోంది. సజీవ భాషలు నిరంతరం అభివృద్ధి చెందుతూనే ఉంటాయి. యాస, మర్యాదపూర్వక సంభాషణా స్వరాలు మెల్లగా అనుభవంతో అలవడతాయి. యంత్రం వీటిని నమోదు చేయగలదు. కానీ అది మనిషి కాదు కదా! కనుక అది మన మాటల లయలో పాల్గొనలేదు. వినడం, అర్థం చేసుకోవడం, తగిన విధంగా ప్రతిస్పందించడం నిరంతర తర్ఫీదు, ఇదే నిజమైన భాషా ప్రావీణ్యత సాధనా మార్గం. కొన్ని దశాబ్దాలుగా పట్టణీకరణ జోరందుకున్నది. ఆంగ్ల మాధ్యమ కాన్వెంట్ చదువులు విస్తృతంగా పెరిగాయి. ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలంటే ఇప్పుడు ఇంగ్లిష్ తప్పని సరైంది. నేడు ఏ భాషనైనా ఏఐ పరికరాల సాయంతో అనువదించడం చాలా సులువైంది. కష్టం లేకుండా చేస్తున్నది టెక్నాలజీ. ఇదే పెనుముప్పు కలిగించే అవకాశం ఉన్నది. భాష నేర్చుకోవలసిన అవసరం లేదనే భావన మనలో ఏర్పరుస్తున్నది. అందుకే టెక్నాలజీని నేర్పుగా వాడాలని భాషా శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. భాష నేర్వడం అంటే పదవినియోగం, శ్రద్ధగా వినడం, జవాబు చెప్పడం, చదవడం, రాయడం మాత్రమే కాదు, సాంస్కృతిక సందర్భం గుర్తెరగాలి. ఇది సామాజిక సంబంధాలను నిలిపే సాధనం. కానీ వ్యక్తిత్వ ఎదుగుదలకు సోపానం. నూతన ఆలోచనా ప్రపంచాలను చేరువచేసే మార్గం. భాష నెమ్మదిగా వంటబడుతుంది. ఇలా నేర్చుకోవడంలో భావోద్వేగం, మానవతలు మిళితమై ఉంటాయి. ఇదే నిజమైన భాషా పండిత్య సాధనకు సోపానం. దీర్ఘకాల ప్రయత్నంతోనే భాషా పటిమ పట్టుబడుతుంది. ఈ సాధనే భాష సజీవంగా నిలిచి వెలిగేలా చేస్తుంది.సైన్స్ ఫార్ములా తెలుసుకోవడం ఓ వియుక్త నైపుణ్యం. మాట్లాడటమే భాష. మాటలో, నవ్వులో, స్వరంలో అనేక భావాలుదాగి ఉంటాయి. ఆలోచన చెప్పడంలో పొరపడి, జాగ్రత్తగా దిద్దుకుంటాం. ఇవి అన్నీ చిన్న చిన్న విషయాలు అనిపిస్తాయి. ఇవి తీపి, చేదు అనుభూతులు కలిగిస్తాయి. అమెరికాలో జరుగుతున్న భారీ లేఆఫ్స్ ప్రభావం భారత్‌లోని ఆఫ్‌షోర్ సెంటర్లపైనా పడుతోంది. అమెరికాలో ఒక ఉద్యోగం పోతే భారత్‌లో 34 ఉద్యోగాలపై ఆ ప్రభావం ఉంటుంది. ముఖ్యంగా బెంగళూరు, హైదరాబాద్‌లోని సర్వీస్ బేస్డ్ కంపెనీలపై ఉంటుంది.

## ఢిల్లీ టూర్‌పై క్లారిటీ

స్పందించిన తీరును ఆయన తప్పుబట్టారు. రేవంత్ రెడ్డికి కేసీఆర్ అంటే కేవలం కడుపుమంట, అక్కసు మాత్రమే ఉన్నాయని, అందుకే అర్థం లేని విమర్శలు చేస్తున్నారని హరీష్ రావు మండిపడ్డారు. జగిత్యాల, కాటారం ప్రాంతాల్లో జరిగిన బహిరంగ సభలను ప్రస్తావిస్తూ.. ప్రజలకు ఇప్పుడు ఒక స్పష్టత వచ్చిందని హరీష్ రావు అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం నిరంతరం తపించే గొప్ప నాయకుడు కేసీఆర్ అని, మరోవైపు ముఖ్యమంత్రి హోదాలో ఉండి కూడా రేవంత్ రెడ్డి చిల్లర మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం రావడం ఖాయమని, ప్రజలే రేవంత్ రెడ్డికి తగిన బుద్ధి చెబుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తన ఢిల్లీ పర్యటనపై ముఖ్యమంత్రి కార్యాలయం (CMO) నుంచి వస్తున్న కథనాలను హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. తన పర్యటనలో దాచడానికి ఏమీ లేదని, అంతా పారదర్శకంగానే జరిగిందని ఆయన స్పష్టం చేశారు. "నేను దొంగచాటుగా ఢిల్లీకి వెళ్లలేదు, అందరి కళ్లముందే శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి విమానం ఎక్కి వెళ్లాను" అని పేర్కొన్నారు. పార్టీ ఫిరాయింపుల కేసుపై న్యాయ నిపుణులతో చర్చలు జరపడమే తన పర్యటన ప్రధాన ఉద్దేశమని ఆయన వివరణ ఇచ్చారు. అంతేకాకుండా, సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న 'ఓటుకు నోటు' కేసు విచారణను కూడా హరీష్ రావు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కేసులో బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే ఇంప్లీడ్ (పక్షంగా చేరడం) అయ్యిందని, రేపు జరగబోయే విచారణ నేపథ్యంలో న్యాయపరమైన సలహాల కోసమే తాను ఢిల్లీలో ఉన్నానని తెలిపారు. పనిలేని వారే తన పర్యటనలపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని, ముఖ్యమంత్రి కార్యాలయం కావాలనే ఇలాంటి 'లీకులు' ఇస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరగా, రహస్య భేటీలు జరపడం తనకు అలవాటు లేదని, అది రేవంత్ రెడ్డికే వెన్నతో పెట్టిన విద్య అని హరీష్ రావు ఎద్దేవా చేశారు. "రాత్రి పూట రాహుల్ గాంధీని కలిసి, మరుసటి రోజు ఉదయమే కేంద్ర మంత్రులను, బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలను కలవడం రేవంత్ రెడ్డికే చెల్లుతుంది" అని ఆయన ఎద్దేవా చేశారు. తన వ్యక్తిత్వంపై బురద చల్లాలని చూస్తే ఊరుకునేది లేదని, ఇలాంటి ప్రచారాలను ప్రజలు నమ్మరని ఆయన స్పష్టం చేశారు.

## బస్సులు బంద్!

గత ఎన్నికల్లో మేనిఫెస్టోలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కానీ ఇప్పటివరకు ఆ హామీని నిలబెట్టకోలేదు. అలాగే వేతన సవరణ, ఇతర ప్రయోజనాలు కల్పించాలని కార్మికులు కోరుతున్నారు. అయితే ఆర్టీసీ కార్మికులు లేవనెత్తిన అన్ని అంశాలు పరిశీలించడానికి నలుగురు అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేసింది. సమస్య పరిష్కారానికి నాలుగు వారాల గడువు ఇవ్వాలని కమిటీ సూచించింది. కానీ కమిటీ ప్రతిపాదనలను జేఏసీ ఒప్పకోలేదు. దీంతో సమ్మె అనివార్యమైందని చెప్పవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా రోజూ లక్షలాది మంది ప్రజలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. ఇక ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ద్వారా మహిళలు పెద్ద సంఖ్యలో ప్రయాణిస్తున్నారు. ఇప్పుడు ఆ సేవలు అన్నీ నిలిచిపోనుండటంతో ప్రజా రవాణా వ్యవస్థ స్తంభించనుంది. అయితే సమ్మెపై రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. ఆర్టీసీ కార్మికులకు సంబంధించిన సమ్మె పరిష్కారం, ప్రయాణికులకు ఇబ్బందులు కలగవద్దనే ఆలోచనతో ఆర్టీసీ కార్మికుల డిమాండ్స్ పై ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఆర్టీసీ కార్మికులు లేవనెత్తిన అన్ని అంశాలు పరిశీలించడానికి నలుగురు అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్టీసీ ప్రతినిధులంతా కమిటీకి మీ అంశాలు విన్నవిస్తే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, తాను ప్రభుత్వం దగ్గర కూర్చొని అధికారుల దగ్గర నివేదిక తీసుకొని సమస్యలు పరిష్కారం చేస్తామని స్పష్టం చేశారు. "ఈ బస్సు ప్రయాణం పేదవాళ్ళకి లైఫ్ లైన్.. ఉద్యోగులుగా మీరు, ప్రభుత్వంగా మేము కలిసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూసే బాధ్యత ఉంది. ఆర్టీసీ సంస్థ పరిరక్షణ,ఉద్యోగుల సంక్షేమం ప్రయాణికుల సౌలభ్యం చూస్తాం..ఎలాంటి బెషజాలలకు పోకుండా అధికారుల కమిటీకి మీ సమస్యలు విన్నవించండి.. ఆ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది" అంటూ పొన్నం పేర్కొన్నారు.

## నిరుద్యోగ యువత గతేంటి?

చేర్చుకున్నారు. మరి ఈ సభతోని.. మీకే 25 ఏళ్లు తగ్గిపోయినయ్.. మీరే నవ యువకుడు.. మీరే అద్భుతంగా రాజకీయం చేయాలని చెప్పిను. మరి తెలంగాణలో ఉన్న యూత్ అంతా సచ్చిపోయినా.. బతికున్నరా..? వాళ్ల ఫ్యూచర్ ఏంది..? వాళ్ల కథేంది అనేది నాకైతే అర్థం కాలేదు. అందుకే నేను అందర్ని ఆహ్వానిస్తున్నా.. కొత్తగా మేం పెట్టబోయే పార్టీలో యూత్‌కు అవకాశాలు ఉంటయ్. యూత్ పార్టీగా మేం ఉంటాం. బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన సభలో బీజేపీని పల్లెత్తు మాట అనలేదు. మహిళా రిజర్వేషన్లపై మాట్లాడలేదు. ఆడ బిడ్డలకు భరోసా ఇవ్వలేదు. ఆ పార్టీలో మహిళలకు ఎలాగూ గౌరవం ఉండదు. కనీసం మహిళా రిజర్వేషన్లపైనా మాట్లాడాల్సి ఉంది. మా ఓటమి మీరే కారణమన్నట్లు ప్రజల్ని తప్పుబడుతున్నారు. రాజకీయ పునరేకీకరణ పేరుతో ప్రజల్ని తప్పుదోవపట్టిస్తున్నారు. జీవన్ రెడ్డి పచ్చి తెలంగాణ వ్యతిరేకి. అలాంటి వ్యక్తిని పార్టీలో చేర్చుకొని తెలంగాణ పునర్నిర్మాణం అని మాట్లాడుతున్నారు. ఇది దారుణం.' అని కవిత కీలక కామెంట్స్ చేశారు.ఇక కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ప్రత్యామ్నాయంగా ప్రజల గొంతుకను వినిపించేందుకు సిద్ధమవుతున్నట్లు ఆమె ప్రకటించారు. ముఖ్యంగా ఉద్యమకారులకు, యువతకు తన కొత్త రాజకీయ ప్రయాణంలో సముచిత స్థానం కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఏప్రిల్ 25న మేడ్చల్ జిల్లా మునీరాబాద్ వేదికగా తాను కొత్త రాజకీయ పార్టీని ప్రారంభించబోతున్నట్లు కవిత స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో నగరవ్యాప్తంగా పబ్లిసిటీ మెటీరియల్, ఫ్లెక్సీలు, బ్యానర్ల ఏర్పాటు విషయంలో జీహెచ్ఎంసీ అధికారులు ఎటువంటి అడ్డంకులు సృష్టించకుండా సహకరించాలని ఆమె కోరారు. ప్రజాస్వామ్యంలో కొత్త శక్తులు ఎదిగేందుకు అవకాశం ఇవ్వాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ కార్మికులు తలపెట్టిన సమ్మెకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు కవిత ప్రకటించారు.




## తెలంగాణలో ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

✍ జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 21 :

తెలంగాణలో బదిలీల కోసం చాలా కాలం నుంచి వేచి చూస్తున్న ఉద్యోగులకు రేవంత్ రెడ్డి సర్కార్ తీపి కబురు అందించింది. ఉద్యోగుల బదిలీలపై ఇప్పటి వరకు ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో ఉద్యోగుల బదిలీలకు సంబంధించి.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జీవో విడుదల చేశారు. మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు రాష్ట్రంలోని అర్హులైన ఉద్యోగుల ట్రాన్స్‌ఫర్లకు అనుమతులు కల్పించింది. 3 ఏళ్లుగా ఒకే చోట పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది.తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై నిషేధం ఎత్తివేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో, ప్రభుత్వోద్యోగుల బదిలీలకు లైన్ క్లియర్ అయ్యింది. ఈ క్రమంలో మే ఒకటో తేదీ నుంచి 31 వరకు ఉద్యోగుల బదిలీకి అనుమతి ఇచ్చింది. ఒకేచోట మూడేళ్లు దాటిన వారు బదిలీ కావడానికి అనుమతిని మంజూరు చేసింది. కాగా, రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీల ప్రక్రియపై సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది.గత కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల బదిలీల ఫైల్‌పై తాజాగా సీఎం రేవంత్ రెడ్డి.. సానుకూలంగా స్పందించడంతో అధికారిక ఉత్తర్వులు వెల్లడి అయ్యాయి. చివరిసారిగా 2024లో ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు జరిగాయి. అదే సమయంలో ఒకేచోట 4 ఏళ్లు పని చేసిన ఉద్యోగులను తప్పనిసరిగా ట్రాన్స్‌ఫర్ చేయనున్నారు. అయితే గరిష్ఠంగా 40 శాతం మంది ఉద్యోగులను మాత్రమే బదిలీ చేయనున్నారు. ఇక స్పౌజ్, మెడికల్, డిసెబిలిటీ ఉన్నవారికి ఈ బదిలీల్లో ప్రాధాన్యత కల్పించనున్నట్లు జీవోలో ప్రభుత్వం పేర్కొంది.

# హాస్టల్ స్థలం మార్పిడిలో కాంగ్రెస్ నేతల హస్తం..?

- సర్వే నంబర్ మార్చేందుకు కోటి రూపాయలకు ఒప్పందం..?
- ఓ కీలక కాంగ్రెస్ నేతకు అడ్వాన్స్ గా 55 లక్షల ఇప్పటికే ముట్టాయని గుప్పుమంటున్న గుసగుసలు.
- 647 సర్వే నెంబర్ కు చెందిన భూమి ప్రభుత్వ భూమి కాదా అని మండిపాటు
- అధికార పార్టీ నాయకుల తీరు పట్ల అనుమానాలు
- అక్రమార్కులకు వత్తాసు పలికి రాజకీయ భవిష్యత్తును కోల్పోవద్దని హెచ్చరికలు
- 647 సర్వేనెంబర్ కు చెందిన భూమిలో హాస్టల్ నిర్మాణం చేపట్టాలి
- అభివృద్ధికి ఆటంకం కలిగిస్తే సహించబోమంటూ స్థానికుల ఆగ్రహం
- కలెక్టర్ దృష్టి హాస్టల్ నిర్మాణానికి కృషి చేయాలని విజ్ఞప్తి



జయభేరి, జవహర్ నగర్ :

శిశు సంక్షేమం ఆధ్వర్యంలో నిర్మించే హాస్టల్ నిర్మాణం దినదినం వివాదాస్పదంగా మారుతుంది హాస్టల్ నిర్మాణం కోసం 647 సర్వేనెంబర్ కు చెందిన ప్రభుత్వ భూమిని కేటాయించి ప్రభుత్వ సెలవు దినము ఆదివారం అయినప్పటికీ శ్రామిక మహిళా వసతి గృహం నిర్మాణం చేపట్టడమే ఏకైక లక్ష్యంగా అధికారులు స్వయంగా ఆదివారం ముగ్గు పోసి హాస్టల్ నిర్మాణం పనులకు శ్రీకారం చుట్టిన అధికారులు నేటి వరకు పనులు చేపట్టకుండా స్థల మార్పిడి కోసం అధికారులు తహతహలాడుతున్న తీరు స్థానికుల్లో దుమారం రేపుతోంది 647 సర్వే నెంబర్ కు చెందిన స్థలం ప్రభుత్వ స్థలం కాదా...? ఈ స్థలం ప్రభుత్వ స్థలం కాకుండా ప్రైవేట్ స్థలం అయినచో ఈ స్థలంలో అధికారికంగా శ్రామిక మహిళా వసతి గృహం నిర్మాణం కోసం ఆదివారం స్వయంగా అధికారులు ముగ్గు పోసి ఈ స్థలం యజమానులను భయభ్రాంతులకు గురిచేసి అధికారులు విధి నిర్వహణలో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారా...? లేక అధికారులు ఎలాంటి అధికార దుర్వినియోగానికి తావివ్వకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి 647 సర్వేనెంబర్ కు చెందిన స్థలం పక్కా ప్రభుత్వ స్థలమే అని నిర్ధారించి హాస్టల్ నిర్మాణం కోసం ముగ్గు పోసి నిర్మాణానికి శ్రీకారం చుట్టిన యెడల హాస్టల్ నిర్మాణం విషయంలో జాప్యం ఎందుకు వహిస్తున్నారు...? లేక ప్రధాన రహదారికి పక్కన ఉన్న ఈ స్థలం సుమారు 12 కోట్ల నుండి 15 కోట్ల విలువచేసే విలువైన స్థలం కావడంతో ప్రభుత్వ భూములను కబ్జా చేసి అమాయక ప్రజలకు ప్లాట్లుగా విక్రయిస్తూ కోట్లు దండుకోవడమే ఏకైక లక్ష్యంగా ఈ 647 సర్వేనెంబర్ కు చెందిన స్థలాన్ని కబ్జా చేసేందుకు చాపను పట్టేందుకు ఎరను దానగా వేసే చందంగా అక్రమార్కులు అధికారులను లోబర్చుకునేందుకు అక్రమ మార్గంలో తెరచాటుగా పెద్ద మొత్తంలో అందజేసే ముడుపులకు ముచ్చటపడి హాస్టల్ నిర్మాణం కోసం భూమి పూజ చేసి ముగ్గు పోసి నిర్మాణానికి అనుకూలంగా ఉన్న ఈ ప్రభుత్వ స్థలాన్ని వదిలిపెట్టి విలువైన ఈ స్థలాన్ని అక్రమార్కుల హస్తగతం చేసేందుకు అధికారులు నిశ్చయించుకొని వేరువేరు సర్వేనెంబర్లకు చెందిన స్థలాల్లో హాస్టల్ నిర్మాణం చేపట్టేందుకు నిర్ణయాలు తీసుకుంటూ విధి నిర్వహణలో అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారా...? అనే విమర్శలు స్థానికుల నుండి వ్యక్తం అవుతున్నాయి.



### పైరవీల కోసం అధికార పార్టీ నాయకులకు...? కోటి లంచం అనే వినికిడి నిజమేనా...?

అత్యంత సులువుగా 647 సర్వేనెంబర్ కు చెందిన ఈ ప్రభుత్వ భూమిని తమ కైవసం చేసుకున్నామని ఈ భూమి ఆక్రమణకు పాల్పడిన అక్రమార్కుల కలలు కల్లలయ్యాయి శ్రామిక మహిళా వసతి గృహ నిర్మాణం కోసం అక్రమార్కుల ఆక్రమణలో ఉన్న 647 సర్వేనెంబర్ కి చెందిన భూమిలో అధికారులు ముగ్గు పోసి పనులు ప్రారంభించడంతో ఎంతో విలువైన భూమి చేయి జారిపోతుందని భయాందోళనకు గురైన అక్రమార్కులు ఎలాగైనా ఈ ప్రభుత్వ భూమిని హస్తగతం చేసుకోవాలంటే అధికార పార్టీ నాయకుల పైరవీ ఎంతో అవసరమని భావించి హాస్టల్ నిర్మాణాన్ని మరోచోటికి బదిలీ చేయించేందుకు పైరవీ కోసం అధికార పార్టీ నాయకులకు ఒక కోటి రూపాయలు ఇచ్చేందుకు తెరచాటుగా ఒప్పందం చేసుకొని 55 లక్షల రూపాయలు ముందుగా అందజేసి ఈ ప్రభుత్వ భూమి అక్రమార్కుల హస్తగతం అయ్యాక మిగతా 45 లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకోవడం జరిగిందని ఈ ఒప్పందం కారణంగానే 647 సర్వేనెంబర్ కు చెందిన ప్రభుత్వ భూమిలో నిర్మించే శ్రామిక మహిళ వసతి గృహ నిర్మాణాన్ని 646 సర్వే నెంబరు గల స్థలంలో చేపట్టేందుకు అధికార పార్టీ రాష్ట్రస్థాయి నాయకుల ఒత్తిళ్లకు లోనై అధికారులు స్థలం మార్పిడి కోసం తహతహలాడుతున్నారని స్థానికుల పుకార్లు షికారు చేస్తున్నాయి.

### అధికార పార్టీ నాయకులు అక్రమాలకు తావిస్తే రాజకీయ భవిష్యత్తు ఉండదని స్థానికుల హెచ్చరికలు

జవహర్ నగర్ అభివృద్ధికి ఆటంకం కలిగించే విధంగా ఎలాంటి లోపాయి కార ఒప్పందాలకు చోటు ఇవ్వకుండా ప్రధాన రహదారికి పక్కన ఉన్న 647 సర్వేనెంబర్ కు చెందిన ప్రభుత్వ భూమిలో శ్రామిక మహిళ వసతి గృహం నిర్మాణం కోసం మేడ్చల్ శాసనసభ్యులు మాజీ మంత్రి మల్లారెడ్డి అధికార పార్టీ నాయకులు కృషి చేయాలని లేని యెడల రాజకీయ భవిష్యత్తును కోల్పోక తప్పదని పార్టీలకతీతంగా జోహార్ నగర్ నాయకులు నాయకీ మనులు ప్రజా సంఘాల నాయకులు విద్యావేత్తలు ఉద్యమకారులు స్థానికులు హెచ్చరిస్తున్నారు జవహర్ నగర్ ప్రాంతాన్ని అభివృద్ధి చెందిన ప్రాంతంగా తీర్చిదిద్దవలసిన పూర్తి బాధ్యత శాసనసభ్యులు మల్లారెడ్డి అధికార పార్టీ నాయకులు పై ఉందనే విషయాన్ని మరిచిపోవద్దని అభివృద్ధికి ఆటంకం కలిగించే ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు సహించబోరని పిల్లి కళ్ళు మూసుకొని పాలు తాగి నన్నెవరూ చూడలేదు అన్నచందంగా అధికారాన్ని అడ్డుపెట్టుకొని తెరచాటు లోపాయి కార తప్పిదాలకు పాల్పడితే ప్రజలు గ్రహించబోరని అమాయకంగా ఆలోచించి రాజకీయ భవిష్యత్తును కోల్పోవద్దని స్థానికులు హితవు పలుకుతున్నారు.

### హాస్టల్ నిర్మాణం పట్ల కలెక్టర్ దృష్టి సారించాలి శిశు సంక్షేమానికి కృషి చేయాలి

రాష్ట్రప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోసం ప్రతిష్టాత్మకంగా ఆచితూచి అడుగులు వేస్తున్న ఈ తరుణంలో శిశు సంక్షేమం ఆధ్వర్యంలో శ్రామిక మహిళ వసతి గృహ నిర్మాణం కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని దర్జాగా కబ్జా చేస్తూ ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడుతున్న అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు దోబూచులాట ప్రదర్శిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు అధికారికంగా హాస్టల్ భవన నిర్మాణం కోసం ముగ్గు పోసి పనులు ప్రారంభించిన స్థలాన్ని మార్పిడి చేసి మరోచోట హాస్టల్ నిర్మాణాన్ని చేపడతామని రెవెన్యూ యంత్రాంగం ప్రదర్శిస్తున్న తీరు ప్రజా ఆగ్రహానికి గురిచేస్తోంది అధికారికంగా కేటాయించిన 647 సర్వే నెంబర్ కు చెందిన ప్రభుత్వ భూమిలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ నిర్మాణాన్ని వేరే చోటికి తరలిస్తున్న విషయంపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తు జరిపించి ఈ హాస్టల్ నిర్మాణం విషయంలో అధికారులు ఏమైనా రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు గురై... లేదా.. అధికారుల స్వలాభం కోసం హాస్టల్ నిర్మాణం తరలింపుకు పాల్పడినట్లు తేలిన ఎడల విధి నిర్వహణలో అధికార దుర్వినియోగానికి పాల్పడినందుకు రెవెన్యూ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఈ హాస్టల్ నిర్మాణం చేపడుతున్న 647 సర్వే నెంబర్ కు చెందిన ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని హాస్టల్ నిర్మాణానికి ఎలాంటి ఆటంకం లేకుండా జరిపించి జవహర్ నగర్ అభివృద్ధికి కృషి చేయాలని జవహర్ నగర్ స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.




## చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

జయభేరి, కాప్రా, ఏప్రిల్ 21 :

వంపుగూడ కాలనీ కమ్యూనిటీ హాల్ వద్ద రాయగట్ల కృష్ణ కిట్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించడం అత్యంత అవసరమని తెలిపారు. ఈ చలివేంద్రం ద్వారా పాదచారులు, కార్మికులు, స్థానిక ప్రజలు ఉపశమనం పొందుతారని పేర్కొన్నారు. సమాజ సేవలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నవీన్ గౌడ్, భద్రుద్దీన్ మల్లారెడ్డి, గణేష్ కృష్ణ గౌడ్ తదితరులు, అలాగే కాలనీ వాసులు, ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

## కాలనీల అభివృద్ధి పనులకు శ్రీకారం

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



జయభేరి, కాప్రా, ఏప్రిల్ 21 :

చర్లపల్లి డివిజన్ పరిధిలో పలు కాలనీల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. Dc కాలనీలో రూ. 44 లక్షల వ్యయంతో, శ్రీ సాయి గణేష్ నగర్‌లో రూ. 24 లక్షలతో, ఈసీ నగర్‌లో రూ. 58 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. కాలనీల్లో రహదారుల సమస్యలను పరిష్కరించి, సౌకర్యవంతమైన రవాణా వ్యవస్థ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ BRS పార్టీ అధ్యక్షుడు నేమూరీ మహేష్ గౌడ్ స్థానిక నాయకులు, BRS పార్టీ నాయకులు కార్యకర్తలు కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## కాప్రా పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా చక్రస్నానం



జయభేరి, కాప్రా, ఏప్రిల్ 21 :

కాప్రా చెన్నకేశవ స్వామి ఆలయంలో 14 సంవత్సరాల క్రితం ప్రతిష్ఠించిన శ్రీ జయమంగళ పంచముఖ ఆంజనేయ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా సుదర్శన హోమం, హనుమాన్ హోమం, జాంబవంతుని హోమం, చక్ర స్నానం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సమీప కాలనీల ప్రజలు పెద్ద ఎత్తున హాజరై భక్తి శ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, విశ్వహిందూ పరిషత్ ఆల్ ఇండియా గవర్నింగ్ కమిటీ సభ్యులు రాఘవులు, తెలంగాణ రాష్ట్ర గవర్నర్ సభ్యులు లక్ష్మీ శేఖర్, మాజీ కార్పొరేటర్ మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, ఈఓ కృష్ణమా చార్యులు, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నల్లూరి శివరామకృష్ణ ప్రసాద్, డాక్టర్ కొండారెడ్డి, డీఎన్, ప్రసాద్, కమిటీ మాజీ సభ్యులు పీసర మల్లారెడ్డి, నరేందర్ గౌడ్, శంకర్ బాబు, మురళి పంతులు, విజయేందర్ రెడ్డి, మోహన్, గజేందర్ రెడ్డి, ఆలయ జూనియర్ అసిస్టెంట్ టి. శ్రీనివాస్, ముఖేష్, మోహన్, విశ్వం తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. సోలిస్ కంటి ఆసుపత్రి సిబ్బంది సేవలు అందజేశారు.

## సైబరాబాద్ పరిధిలో మెరుగైన మౌలిక సదుపాయాలు



జయభేరి, శేరిలింగంపల్లి :

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ జి. సృజన IASని సైబరాబాద్ నగర పాలక సంస్థ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి బొకే ఇచ్చి సత్కరించిన శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్. శేరిలింగంపల్లి డివిజన్ లో నూతనంగా నిర్మాణం చేపట్టబోయే ఫ్లైఓవర్ అభివృద్ధి వలన రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని.. కానీ ఈ ప్రాంతంలో గత 30 ఏళ్లు గా నివసిస్తునటువంటి పేద కుటుంబాలకు చెందినవారు ఉన్నందున వారిని దృష్టిలో పెట్టుకుని ఫ్లైఓవర్ పనులను 30 మీటర్ల వరకు మాత్రమే కుదించి భూసేకరణ చేపట్టి ఫ్లైఓవర్ నిర్మాణం ఏర్పాటు చేసి సౌకర్యవంతమైన రవాణా సౌకర్యాన్ని కల్పించాలని.. అలాగే తారానగర్ మార్కెట్ మెయిన్ రోడ్డును 80 ఫీట్ లకు కుదించి మెయిన్ రోడ్డు అభివృద్ధి పరచాలని కమిషనర్ ని కోరిన కార్పొరేటర్. సీఎంసీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా సైబరాబాద్ పరిధిలో మెరుగైన మౌలిక సదుపాయాలు, పట్టణాభివృద్ధిపై సైబరాబాద్ కమీషనర్ సృజన దృష్టి సారించిన్నట్లు కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సోమదాస్, సీనియర్ నాయకులు మిరియాల రాఘవరావు, జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు.



## కమిషనర్ కు కనీస వేతనాలు అమలు చేయాలని వినతి

జయభేరి, హైదరాబాద్ :

జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ లో పనిచేస్తున్న ఉద్యోగులకు అనగా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సూపర్వైజర్ గా పనిచేస్తున్న పబ్లిక్ హెల్త్ మేనేజర్ కు 40000, అకౌంటెంట్ 36000, సపోర్టింగ్ స్టాఫ్ 21000 ఈ మూడు క్యాడర్లకు కనీస వేతనాలు ప్రకటన చేయాలని హైదరాబాద్ కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ సర్వే సంగీత సత్యనారాయణ ఐ.ఏ.ఎస్.కు మంగళవారం వినతిపత్రం అందజేసిన కనీస వేతనాల బోర్డు మెంబర్, ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి యూసెఫ్, తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ, రాష్ట్ర కార్యదర్శి ఒమయ్య, లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.




అత్యుత్తమమైన విధానం పోలీస్ డిపార్ట్మెంట్లోనే ఉంది. సామాన్యులను రాచిరంపాన పెట్టి ఎఫ్ ఐఆర్ లతో వేధిస్తూ అక్రమ కేసులు బనాయించే వీరికి మాత్రం చట్టం వర్తించదు. పోలీస్ అధికారులు నిజాయితీపరులు ఎంతోమంది ఉన్నారు. కానీ ప్రస్తుతం పోలీస్ స్టేషన్ అంటేనే ప్రజలు ఒక వణుకు. చిన్న పని మీద వెళ్లిన డబ్బులు ఇవ్వకుంటే వేధిస్తున్న పరిస్థితి. ప్రస్తుతం తెలంగాణలో పోలీస్ అంటేనే ఒక రకమైన భయత్పాతం ఏర్పడింది. ఈ లంచాలు ఆగం అక్రమ కేసులు ఆపరు కోర్టులు ప్రత్యేక దృష్టి సారించి అవినీతి అధికారులను సాగనంపాలని కోరుకుంటున్నారు సామాన్యులు.

జయభేరి, హైదరాబాద్

## వైభవంగా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం

- అహోబిలం జీయర్ స్వామీజీ ఆధ్వర్యంలో భక్తి పూర్వకంగా కళ్యాణం
- బీజేపీ నాయకులు, స్థానిక ప్రముఖుల సమక్షంలో ఘన వేడుకలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం





జయభేరి, మేడిపల్లి :

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పిర్జాదిగూడ డివిజన్ పర్వతాపూర్ సమీపంలోని శ్రీ లక్ష్మీనరసింహ ఆలయంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ పవిత్ర కార్యక్రమానికి శ్రీశ్రీశ్రీ అహోబిలం జీయర్ స్వామీజీ విచ్చేసి స్వామివారి కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య జరిగిన ఈ మహోత్సవం భక్తులను ఆధ్యాత్మికానందంలో ముంచెత్తింది. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇంచార్జి, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే మేడ్చల్ రూరల్ జిల్లా ఉపాధ్యక్షులు గొంగళ్ళ బాలేష్, ఇతర స్థానిక నాయకులు, భక్తులు భారీగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భక్తులతో కళకళలాడిన ఆలయ ప్రాంగణంలో స్వామివారి దివ్య కళ్యాణం ఘనంగా సాగి అందరికీ ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచింది. ఈ కార్యక్రమంలో జిల్లా యువ మోర్చా అధ్యక్షులు బండారు పవన్ రెడ్డి, కన్నెబోయిన రాము యాదవ్, గూడెం సత్యనారాయణ, శేఖర్ గౌడ్, కరుణాకర్ రెడ్డి, పాల్గొన్నారు.

## శ్రీ సాయి ఎస్వై నగర్ కాలనీలో సీసీ రోడ్ల ప్రారంభోత్సవం

- మాజీ డిప్యూటీ మేయర్ స్రవంతి కిషోర్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పద్దం లోకేష్



జయభేరి, మేడిపల్లి :

బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని బొల్లిగూడెం శ్రీ సాయి ఎస్వై నగర్ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్ల పనులు విజయవంతంగా పూర్తయిన సందర్భంగా రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బోడుప్పల్ మున్సిపల్ మాజీ డిప్యూటీ మేయర్ స్రవంతి కిషోర్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పద్దం లోకేష్ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది. ఇ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు కాంతా రెడ్డి మాట్లాడుతూ.. కాలనీవాసుల ఇబ్బందులను గమనించిన కిషోర్ గౌడ్ రోడ్ల నిర్మాణానికి పూర్తి సహకారం అందించి, ఈ సీసీ రోడ్ల నిర్మాణం జరగడానికి ముఖ్య పాత్ర పోషించారని అన్నారు. ఇందుకు కాలనీవాసులు తమ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

అదేవిధంగా కాలనీలో ఇంకా కొన్ని రోడ్లు నిర్మాణం కావాల్సి ఉన్నందున, అవి కూడా త్వరగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా మనవి చేయడం జరిగింది. అనంతరం కిశోర్ గౌడ్ మాట్లాడుతూ రెండు నెలలో పూర్తి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ గిరి కొండపల్లి, కోశాధికారి జి.సత్తయ్య, అక్బర్, మహాలక్ష్మి కాలనీ అధ్యక్షులు రూపం విష్ణు కాలనీ పెద్దలు బాలకృష్ణారెడ్డి, మునీర్ హైమద్, సూర్య ప్రకాష్ రావు, ప్రసాద్, రాజి రెడ్డి, ఎల్లారెడ్డి, జోజయ్య, సత్యనారాయణ, లక్ష్మీ నారాయణ సాయిలు, రవి యాదవ్ కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శక్తి – ధర్మ పరిరక్షణకు అందరం ముందుకు రావాలి

- కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- బీజేపీ నేతలు అందే బాబయ్య, విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీవర్ధన్ రెడ్డి

**జయభేరి, షాద్ నగర్, ఏప్రిల్ 21 :**



హిందూ ధర్మాన్నిహిందూ ఐక్యతే ఒక శక్తి. ధర్మ పరిరక్షణకు అందరం ముందడుగు వేయాలి. హిందూ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరి పైనే ఉందని పిలుపు ఇచ్చిన హిందూ సమ్మేళన కార్యక్రమం. రంగా రెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ పరిధిలోని కెఎన్ గార్డెన్‌లో డా. రాచప్ప అధ్యక్షతన నిర్వహించిన హిందూ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. ముఖ్య వక్తగా విశ్వహిందూ పరిషత్ శేత్ర సంఘటన కార్యదర్శి శ్రీ సత్యం జీ పాల్గొన్నారు.
శ్రీ శ్రీ శ్రీ శివానంద స్వామి, సీనియర్ జర్నలిస్ట్ శ్రీమతి దేవిక, మున్సిపాలిటీ ఛైర్మన్ బసప్ప, రాచప్ప, నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందే బాబయ్య, విష్ణువర్ధన్ రెడ్డి, బండారి రమేష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ వంద సంవత్సరాల ప్రస్థానంలో హిందూ సమాజాన్ని సంఘటితం చేయడానికి ఇటువంటి హిందూ సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ... హిందూ సమాజం బలంగా ఉండాలంటే రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా ధర్మం కోసం నిలబడాలని పిలుపునిచ్చారు. అలాగే ఆర్ ఎస్ ఎస్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. ముఖ్య వక్త శ్రీ సత్యం జీ మాట్లాడుతూ.. భారతదేశం ఆధ్యాత్మికతకు నిలయమని, హిందూ సంస్కృతి ప్రపంచానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. అలాగే సమాజంలో ఐక్యత, సంస్కృతి పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. "గడప లోపల కులం - గడప దాటితే హిందువు" అనే భావనతో సమాజంలోని అన్ని వర్గాలు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలను గమనిస్తూ యువతను మత్తు వ్యసనాల నుంచి కాపాడాలని, మహిళల భద్రతపై దృష్టి పెట్టాలని సూచించారు.



శ్రీ శ్రీ శ్రీ శివానంద స్వామి తన ప్రసంగంలో ధర్మ పరిరక్షణ ప్రతి హిందువు కర్తవ్యమని, కుటుంబం నుంచే సంస్కారం ప్రారంభమవుతుందని వివరించారు. సంప్రదాయాలు, ఆచారాలు, పండుగలను కాపాడటం ద్వారా భవిష్యత్ తరాలకు బలమైన పునాది ఏర్పడుతుందని తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్ శ్రీమతి దేవిక మాట్లాడుతూ మహిళలే హిందూ సంస్కృతి పరిరక్షకులని, కుటుంబ వ్యవస్థ బలంగా ఉంటేనే సమాజం బలపడుతుందని పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్న కళాకారులకు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందే బాబయ్య, విష్ణువర్ధన్ రెడ్డి మెమొంటోలు అందజేశారు.
ఈ కార్యక్రమంలో నాగిళ్ల ప్రభాకర్, అశోక్ గౌడ్, ప్యాట అశోక్, శ్రీనివాస్ చారి, చెట్ల వెంకటేష్, మంగ విజయ్, సుధాకర్, అప్పా బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని వెంకట్ రెడ్డి వ్యాఖ్యానించగా, శ్రీమతి భాగ్యవతి, రుషికేష్, కొత్త సతీష్ తదితరులు పాల్గొని విజయవంతం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కోలాటం, భరతనాట్యం, మహాభారత్ థీమ్ నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. పెద్ద ఎత్తున మహిళలు, హిందూ బంధువులు పాల్గొని హిందూ ఐక్యతను ప్రతిబింబించారు.




## చిన్నారుల ఎదుగుదల పై తల్లి తండ్రులకు అవగాహన కల్పించాలి

**జయభేరి, చింతపల్లి :**

చిన్నారుల ఎదుగుదల పై తల్లి తండ్రులకు అవగాహన కల్పించాలని తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి అన్నారు. చింతపల్లి మండలం తీదేడు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో పోషన్ అభియాన్ అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషణ లోపాల వల్ల చిన్న పిల్లలకు రక్త హీనత బరువు తగ్గుట, ఎదుగుదలలో లోపం వంటి సమస్యలకి గురి అవుతున్నారని అన్నారు. పిల్లలకు సరైన పోషక పదార్థాలు అందించాలని ఆమె అన్నారు. గర్భిని స్త్రీలు ఐరన్ కాల్షియం మాత్రలు తీసుకోవాలని క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ఆమె అన్నారు. ప్రతి ఒక్కరు పోషకాహారం పై అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ ప్రసన్న లక్ష్మి, అంగన్వాడి టీచర్లు మర్రు వెంకటమ్మ,జూలురి స్వప్న,రావు లక్ష్మి,జెల్ల కవిత,పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ లో చేరిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు

- పార్టీ కండువా కప్పి స్వాగతం పలికిన ఎమ్మెల్యే జిఎంఆర్



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని చిన్నచింతకుంట మండలం పర్దిపూర్ గ్రామ పరిధిలోని గోప్యా నాయక్ తాండ గ్రామపంచాయతీకి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు మంగళవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తాండాకు చెందిన గ్రామ అధ్యక్షుడు శ్రీను నాయక్, భాస్కర్ నాయక్, గోబ్రు నాయక్, శంకర్ నాయక్, బబ్లు నాయక్, గోపాల్ నాయక్, అశోక్ నాయక్, శివ నాయక్ లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే జిఎంఆర్ స్వాగతం పలికారు. పర్దిపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి తండా నాయకులు చంద్ర నాయక్ ఆధ్వర్యంలో వీరు కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ముచ్చింతలలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని కౌకుంట్ల మండలం ముచ్చింతలలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ఆదేశాల మేరకు పిఎసిఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి టిపిసిసి ఆర్గనైజింగ్ కార్యదర్శి కొత్త అరవింద్ కుమార్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాదిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, కురుమూర్తి స్వామి దేవస్థానం చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి లతోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## డిసిసి కార్యదర్శిని సన్మానించిన ఎమ్మెల్యే జిఎంఆర్



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని మూసాపేట్ మండలం పోల్కంపల్లి గ్రామానికి చెందిన యాదయ్యకు డిసిసి కార్యదర్శిగా పదవి రావడంతో ఆయనను మంగళవారం ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ఘనంగా సన్మానించారు. హైదరాబాద్ లో పదవి రావడంతో తనను కలవడానికి వచ్చిన యాదయ్యకు ఎమ్మెల్యే జిఎంఆర్ ఈ సన్మానం చేశారు. శాలువా కప్పి సత్కరించారు. దీంతో ఎమ్మెల్యే జిఎంఆర్ కు నూతనంగా ఎన్నికైన డిసిసి కార్యదర్శి యాదయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే జిఎంఆర్ కు జీవితాంతం రుణపడి ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో మూసాపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శక్తి చంద్ర శేఖర్ తోపాటు మూసాపేట్ మండల సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చర్లపల్లి పారిశ్రామికవాడ సమగ్ర అభివృద్ధికి చర్యలు

- చర్లపల్లి పారిశ్రామికవాడలో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**జయభేరి, కాప్రా :**




చర్లపల్లి పారిశ్రామికవాడ సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం చర్లపల్లి పారిశ్రామికవాడలోని చర్లపల్లి పారిశ్రామికవేత్తల సంఘంలో చర్లపల్లి ఐలా, సిఐఏ పాలక వర్గం సభ్యులతో కలసి పారిశ్రామికవాడలో చేపడుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఇటీవల చర్లపల్లి రైల్వే స్టేషన్ విస్తరించడంతో నిత్యం ఎంతో మంది ప్రయాణీకులు చర్లపల్లి పారిశ్రామికవాడ గుండా ప్రయానిస్తున్నారు. అలాగే పారిశ్రామికవాడలో పని చేసేందుకు వేలాది మంది కార్మికులు ప్రయానించే చక్రీపురం కూడలి నుంచి గణేష్ టెంపుల్ కమాన్ వరకు రోడ్డు విస్తారణతో పాటు పారిశ్రామికవాడలో డ్రైనేజీ సమస్య పరిష్కరం వంటి సమస్యలను పారిశ్రామికవేత్తలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులతో మాట్లాడి చర్లపల్లి రైల్వేస్టేషన్ కు వేల్లే రహదారి, చక్రీపురం నుంచి గణేష్ టెంపుల్ కమాన్ వరకు రోడ్డు విస్తారణ చేపడుతామని తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి కోసం నిధులు మంజురు చేయిస్తానని తెలిపారు. అలాగే త్వరలోనే మల్కాజ్గిరి ఎంపి ఈటెల రాజేందర్ ను పారిశ్రామికవాడకు తీసుకువచ్చి ఎంపీ నిధులతో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారసు. ఈకార్యక్రమంలో టిఫ్ చైర్మాన్ సూధీర్ రెడ్డి , ఐలా చైర్మన్ డాక్టర్ గోవిందరెడ్డి, సిఐఎ అధ్యక్షుడు డి. శ్రీనివాసరెడ్డి, కమిటి ప్రతినిదులు పిఎన్ మోహన్, తాటి శ్రీనివాస్, సుధాకర్ రెడ్డి , మాజీ చైర్మాన్ హరీష్ రెడ్డి, మిరుపాల గోపాల్రావు, వేంకటేశ్వర్ రెడ్డి , మండ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

- హిందూ సమ్మేళన కరపత్ర ఆవిష్కరణ
- పార్టీలకు అతీతంగా పాల్గొన్న హిందూ బంధువులు

**జయభేరి, కొండమల్లేపల్లి :**



కొండమల్లేపల్లి పట్టణంలో ఈనెల 26న ఆదివారం సాయంత్రం ఆరుగంటలకు సాగర్ రోడ్ లోని మార్కెట్ యార్డులో నిర్వహించనున్న హిందూ సమ్మేళన కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు.
హిందూ సమ్మేళన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని శ్రీ సీతారామచంద్రమౌళీశ్వర ఆలయంలో మంగళవారం ఆవిష్కరించారు.
ఆలయ కమిటీ చైర్మన్ నాయిని మాధవ రెడ్డి, కొండమల్లేపల్లి హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హిందూ పెద్దలు మాట్లాడుతూ హిందువుల ఐక్యతను చాటే అందుకు ఈనెల 26న మార్కెట్ యార్డులో నిర్వహించే హిందూ సమ్మేళన కార్యక్రమంలో ప్రతి కుటుంబం నుండి పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీలకతీతంగా పలువురు హిందూ నాయకులు హాజరయ్యారు. ఈ హిందూ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పూజనీయ శ్రీ శ్రీ శ్రీ విశోక తీర్థ స్వామి పాల్గొంటున్నారని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నాయిని మాధవరెడ్డి, కార్యదర్శి నీల లక్ష్మయ్య, గజ్జల చిత్తరంజన్ రెడ్డి, నాగిరెడ్డి రవీందర్ రెడ్డి, కొండమల్లేపల్లి హిందూ సమ్మేళన సమితి గౌరవ అధ్యక్షులు బొడిగ సాంబశివ గౌడ్, అధ్యక్షులు ఏరుకొండ రాము, ప్రధాన కార్యదర్శి దాచేపల్లి నరేందర్, కోశాధికారి గుమ్మడవెల్లి జనార్ధన్, వింజమూరి చంద్రమౌళి, ఆంజనేయులు,నూతన గంటి ఈశ్వర్,గంట శ్రీనివాస్, బోడిగ శంకర్ గౌడ్, సముద్రాల సంతోష్, మిర్యాల పవన్, మిరియాల శ్రీనివాస్, తెరాటిపల్లి విట్టల్, రావుల సత్యానారాయణ, భూతరాజు భరత్, లచ్చి రామ్ నాయక్, నాగార్జున రెడ్డి,ముత్యం, అంజన్ కుమార్, సంపెంగ మురళి, బండారు జయశ్రీ ,గుమ్మడపల్లి గీత, గాజుల వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య, పోషకాహార అవగాహన కార్యక్రమం

**జయభేరి, దేవరకొండ :**



తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ కళాశాల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లోని సంక్షేమ వారోత్సవాల్లో20, 26/04 /2026 భాగంగా ఆరోగ్య పోషకాహార అవగాహన కార్యక్రమానికి ముఖ్య అధితులుగా బొడ్డుపల్లి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆలియా, సూపర్ వైజర్ సఫియా, MPHW స్వాతి స్టాఫ్ నర్స్ విద్యావత మహిళా డిగ్రీ కళాశాలకు అతిధులుగా విచ్చేసినారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పథకాలపై అవగాహన ఆరోగ్య సంరక్షణ సలహాలు సూచనల గురించి విద్యార్థినిలకు వివరించటం జరిగింది కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. హరిప్రియ, అధ్యాపక బృందం హెల్త్ హైజీన్ కమిటీ సభ్యులు తెలియజేశారు.



## కొండపైన వర్తక సంఘాన్ని రద్దు చేయాలని వినతి

**జయభేరి, యాదగిరిగుట్ట, ఏప్రిల్ 21:**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి కొండపైన ఉన్న వర్తక సంఘాన్ని రద్దు చేయాలని బీజేపీ పార్టీ పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ డిమాండ్ చేశారు. మంగళవారం దేవాదాయ, ధర్మాదాయ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కర్రె ప్రవీణ్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కొండపైన దుకాణాలను ఏర్పాటు చేసుకొని,వాటికి టెండర్ వేయకుండా రెన్యువల్ చేసుకుంటున్నారు. వివిధ రాజకీయ పార్టీలు, ప్రభుత్వ అధికారాన్ని అడ్డం పెట్టుకొని భక్తులను ఇబ్బంది పెట్టడమే కాకుండా యాదగిరిగుట్ట దేవస్థానం ఆదాయానికి గండి కొడుతున్నారని,అలాంటి వర్తక సంఘాన్ని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రెన్యూవల్ కోసం భారీ ఎత్తున డబ్బులు చేతులు మారేందుకు సమయం ఆసన్నమైందని,ఈసారి గనుక షాపులను రెన్యువల్ చేస్తే ఊరుకునే ప్రసక్తేలేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిజేపి పట్టణ ప్రధాన కార్యదర్శి మందోజి నరేష్, శివరాత్రి శ్రీశైలం,భోగ అజయ్, శ్రీనాథ్,విజయ్,ప్రవీణ్,శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## మావిగన్ పై అనవసర ట్రాల్స్

**జయభేరి, గుంటూరు :**

మావిగన్ ప్రాజెక్టుపై అనవసరంగా ట్రోల్స్ చేస్తున్నారని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రకాశం జిల్లా ఒంగోలు వైసీపీ కార్యాలయంలో మాట్లాడుతూ తిరుపతి ప్రసాదంలో కొవ్వు కలిసిందని ఎలా తప్పుడు ప్రచారం చేశారో, అలానే ఇప్పుడు మావిగన్ ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. మావిగన్ ఒక అద్భుతమైన ప్రతిపాదన అని, మూడు రాజధానుల నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం అడ్డుకుందని ఆయన అన్నారు.

## క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్టు

**జయభేరి, గుంటూరు :**

గుంటూరు జిల్లా కొల్లిపర మండలం అత్తోట గ్రామంలో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముఠాపై పోలీసులు దాడి చేసి ఆరుగురిని అరెస్ట్ చేశారు.నిందితుల వద్ద నుంచి 10,000 నగదు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. బ్యాంక్ ఖాతాల్లోని 3. 61 లక్షలను ఫ్రీజ్ చేశారు. ప్రధాన సూత్రధారి పరారీలో ఉండగా, అతని కోసం గాలింపు కొనసాగుతోందని తెనాలి డీఎస్పీ బి. జనార్ధనరావు తెలిపారు.

## జగిత్యాలకు యూఐడిఎఫ్ నిదులు కేటాయించండి

**జయభేరి, హైదరాబాద్ :**

జగిత్యాల శాసనసభ్యుడు డాక్టర్ సంజయ్ కుమార్ మున్సిపల్ అభివృధి విషయంలో ప్రిన్సిపాల్ సెక్రెటరీ (CDM) శ్రీదేవి ని కలిసి యూఐడిఎఫ్ ఫండ్స్ లో విదివిదానాలగురించి మరియు అందులో ఉన్న జాప్యలగురించి, యు జగిత్యాల మున్సిపల్ లో సిబ్బంది కోరత ఉందని కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన శ్రీదేవి తొందర్లోనే వీటన్నిటికి పరిష్కారం చూపిస్తామని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి జగిత్యాల లో జరుగుతున్న వివిధ రాజకీయ పరిణామాల గురించి కూడా చర్చించారు.

# భారత్‌అమెరికా వాణిజ్య బంధంలో కొత్త అధ్యాయం

జయభేరి, న్యూఢిల్లీ:



భారతదేశం - అమెరికా మధ్య ఆర్థిక సంబంధాలను మరో ఉన్నత స్థాయికి తీసుకెళ్లే దిశగా వాషింగ్టన్‌లో కీలకమైన వాణిజ్య చర్చలు ప్రారంభమయ్యాయి. ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల మధ్య ఒక సమగ్ర వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవడమే లక్ష్యంగా ఈ సమావేశం జరుగుతోంది.
భారత వాణిజ్య మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి దర్పణ్ జైన్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం, అమెరికా ప్రధాన సంధానకర్త బ్రెండన్ లించ్‌తో ముఖాముఖి చర్చలు జరపనుంది. ఇరు దేశాల మధ్య వాణిజ్య అడ్డంకులను తొలగించి, మార్కెట్ ప్రవేశాన్ని సులభతరం చేయడమే లక్ష్యంగా ఈ చర్చలు కొనసాగనున్నాయి. ఇప్పటికే మెజారిటీ అంశాలపై ఏకాభిప్రాయం కుదిరిందని, కేవలం కొన్ని సాంకేతిక అంశాలను ఖరారు చేయడమే మిగిలి ఉందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ ఒప్పందానికి పునాదులు గతేడాది ఫిబ్రవరిలో పడ్డాయి. 2025 ఫిబ్రవరి 13న, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ - భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కలిసి BTA (Bilateral Trade Agreement) పై పనులు వేగవంతం చేయాలని నిర్ణయించారు. ఒకరి మార్కెట్లోకి మరొకరి వస్తువుల రాకపోకలను సరళీకృతం చేయడం ద్వారా ఆర్థిక వృద్ధిని సాధించాలన్నది ఇద్దరు నేతల ఉమ్మడి సంకల్పం. “ట్రంప్ ప్రభుత్వం - భారత్ మధ్య చర్చలు అత్యంత సానుకూలమైన, అర్థవంతమైన దిశలో సాగుతున్నాయి.” అని ఒక ఉన్నత స్థాయి అమెరికా అధికారి తెలిపారు. ఈ చర్చల అనంతరం భారత్, అమెరికాలు త్వరలోనే ఒక చారిత్రాత్మక వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించే అవకాశం ఉంది. దీనివల్ల అనే ప్రధాన ప్రయోజనాలు కలగనున్నాయని భావిస్తున్నారు. ఎగుమతులు, దిగుమతులపై సుంకాలు తగ్గడం వల్ల వ్యాపార వ్యయం తగ్గుతుంది. అలాగే నిబంధనలు సులభతరం కావడం వల్ల పెట్టుబడులు పెరుగుతాయి. ఈ ఒప్పందం కుదిరితే, వ్యూహాత్మక రక్షణ భాగస్వామ్యంతో పాటు ఆర్థిక రంగానికి కూడా ఇరు దేశాల మధ్య ఒక నవశకం ప్రారంభమవుతుంది. 2026, ఫిబ్రవరి 7న ప్రారంభమైన ఈ ప్రక్రియ ఇప్పుడు ముగింపు దశకు చేరుకుంది. ఈ ఒప్పందం కార్యరూపం దాల్చితే, అది అటు అమెరికా వినియోగదారులకు, ఇటు భారతీయ ఉత్పత్తిదారులకు భారీ మేలు చేకూర్చడమే కాకుండా ప్రపంచ వాణిజ్య ముఖచిత్రాన్ని మార్చే అవకాశం ఉంది.



## వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

- మంచి నీటి సరఫరా మెరుగుపర్చేందుకు కృషి చేస్తున్నామన్న - చైర్మన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి

జయభేరి, శామీర్ పేట్, ఏప్రిల్ 21 :

వార్డుల్లో మంచినీటి సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని తుర్కపల్లి లోని 1,2,4 వార్డుల్లో మున్సిపల్ నిధులతో బోర్ ఫ్లషింగ్ పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుత వేసవి కాలంలో తాగునీటి సమస్యలు రాకుండా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే ఈ రోజు బోర్ ఫ్లషింగ్ పనులు చేపట్టినట్లు వివరించారు. రానున్న రోజుల్లో మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో నీటి సరఫరా మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్, 1, 2, 4 వార్డుల కౌన్సిలర్లు వెంకటేష్ నాయక్, గుర్కల దీప సాయికృష్ణ, యేళ్ల దీపిక వరప్రసాద్ రెడ్డి, జశ్వంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణారెడ్డి, అశోక్ రెడ్డి, ఏ ఎం సి డైరెక్టర్ బిక్షపతి, మున్సిపల్ ఏ ఇ సన తదితరులు పాల్గొన్నారు.

## మంచిర్యాల రైల్వే స్టేషన్ ను పరిశీలించిన ఎంపి వంశీ కృష్ణ



జయభేరి, మంచిర్యాల :

పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ మంగళవారం మంచిర్యాల రైల్వే స్టేషన్ను సందర్శించి, అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనులను సవివరంగా పరిశీలించారు. పనుల నాణ్యతపై ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేస్తూ, ప్రతి పని సమయానికి పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. ప్రయాణికులకు సురక్షితమైన, ఆధునిక సౌకర్యాలు అందించడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, తాగునీరు, కూర్చునే సదుపాయాలు, లైటింగ్, పార్కింగ్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అదనంగా, వృద్ధులు, మహిళలు, దివ్యాంగుల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రయాణికుల సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా అధికారులు స్పందించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, డీసీపీ, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జలమే జీవం జల సంరక్షణే ధ్యేయం

- ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి

జయభేరి, కర్నూలు :

ఎమ్మెల్యే బుడ్డా కరివేన చెరువు పంట కాలువ వద్ద "జలధార" కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉపాధి హామీ కూలీలతో కలిసి పంట కాలువలో పూడికతీత, సాగునీటి కాలువలను శుభ్రం చేసారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భావితరాలకు నీటి ఎద్దడి లేకుండా చేయాలన్నదే జలధార ధ్యేయం..చెరువుల పునరుద్ధరణతో వర్షపునీటిని వడిసిపట్టి రైతులకు అందిస్తాం. కాలువలు, చెక్ డ్యామ్ లలో పూడికతీత, మరమ్మత్తులతో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలన్నదే లక్ష్యమని అన్నారు.

## భూమి కబ్జాకు గురి అవుతున్న భూమినీ ప్రభుత్వం స్వాధీన పరుచుకోవాలి

- ఆర్డీవో రమణారెడ్డి, ఎమ్మార్వో సూపర్డెంట్ రేణుకకు వినతి పత్రం అందజేయుట
- సామాజికవేత్త, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్

జయభేరి, దేవరకొండ :



దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని సర్వేనెంబర్ 657 గల ప్రభుత్వ భూమి లో అక్రమంగా ఇంటి నిర్మాణం, కొంతమంది వ్యక్తులు ప్లాట్ల రూపంలో కబ్జా చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకుంటూ స్వాధీనం చేసుకోవాలని దేవరకొండ ఆర్డీ ఓ రమణారెడ్డి కి, దేవరకొండ ఎమ్మార్వో సూపర్డెంట్ రేణుక కి వేరువేరుగా వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలోని సర్వేనెంబర్ 657లో డిండి హైవే రోడ్ ఎల్ఐసి ఆఫీస్ వెనుక భాగాన బంజారా కాలనీ తూర్పు భాగాన కొంతమంది అక్రమంగా ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తూ గృహ నిర్మాణాలు చేస్తున్నారు. కొంతమంది వ్యక్తులు ప్లాట్ల రూపంలో కబ్జా చేస్తూ రాళ్లతో హద్దులు నిర్మాణం చేసుకొని ప్రభుత్వ భూమిని కాజేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. దీనివలన ప్రభుత్వ కార్యాలయాలకు ప్రభుత్వ అవసరాలకు భవిష్యత్తులో ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉంటుంది.
అక్రమంగా భూమిలోఇండ్ల నిర్మాణం చేస్తూ కొంతమంది హద్దురాళ్లతో కబ్జాకు గురి చేయడం వల్ల భూదోపిడి జరుగుతుంది. ప్రజా ప్రయోజనాల దృశ్య ఇట్టి భూమిని స్వాధీన పరుచుకొని ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకుంటే మంచిగుంటుందని మా అభిప్రాయం. భూమిని పరిశీలించి సదరు వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటూ ప్రభుత్వ భూమి కాపాడాలని మా యొక్క మనవి.
ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు, పున్న వెంకటేష్ నేత, భీమగోల శివ గౌడ్, పెరికేటి శ్రీనివాస్ చారి, డాక్టర్ భాషా చౌహన్ ,నటవ సుధాకర్, పున్న బిక్షమయ్య, గడ్డం బిక్షమయ్య, గణేష్ ,హరి ,చెరుకు అంజి గౌడ్, అనిల్ గౌడ్, సంజీవ యాదవ్, యాదయ్య చారి, అంకం మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## KGBV హాస్టలో పోషణ పక్షం ప్రోగ్రాం

జయభేరి, దేవరకొండ :



పోషణ పక్షంలో భాగంగా, దేవరకొండ మండలం మైనంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కొర్రతండ అంగన్వాడీ కేంద్రం దేవరకొండ KGBV హాస్టలో పోషణ పక్షం ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా సూపర్వైజర్ విజయలక్ష్మి డి సిపియు యూనిట్ సభ్యులు అంజలి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పకుండా పోషక విలువలు కలిగినటువంటి ఆహార పదార్థాలు ప్రతినిత్యం తీసుకోవాలి అని వివరించారు, ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు పిల్లలు సిరి ధాన్యాలతో పాటుగా మన పరిసరాలలో దొరికే కాయగూరలు, ఆకుకూరలు, పండ్లు తప్పకుండా తీసుకోవాలి అని తెలియజేయడం జరిగింది. వేయి రోజుల ప్రాముఖ్యత గురించి,మూడు నుంచి ఆరు సంవత్సరాల వయసులో పిల్లల మెదడు 90 శాతం అభివృద్ధి జరుగుతుంది కాబట్టి ఈ వయసులో పిల్లలకు ఎక్కువ అవకాశాలు కల్పించాలి అప్పుడే వారి అభివృద్ధి కుంటూ పడకుండా ఉంటుందని తెలియజేయడం జరిగింది. అలాగే డిసిపియు యూనిట్ మెంబర్ అంజలి బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి, బాల్యవివాహాలు చేయడం ద్వారా తల్లిదండ్రులకు మరియు ప్రోత్సహించే అటువంటి వారికి ఎలాంటి శిక్షలు పడతాయి అని వివరించడం, తల్లిదండ్రులు లేని అనాథ బాలలకు మిషన్ వాత్సల్య పథకంపై అవగాహన కలిపించడం అక్రమంగా పిల్లలను దత్తత తీసుకోవడం ఇవ్వడం చట్టరీత్యా నేరం అన్ని అవగాహన కల్పించటం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొర్ర రాంసింగ్ మాట్లాడుతూ అంగన్వాడీ కి పిల్లలను పంపించాలి గవర్నమెంట్ నుండి వచ్చేవి బెనిఫిట్స్ వినియోగించుకోవాలని అలాగే ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో కేజీబీవీ SO సావిత్రి, హెల్త్ డిపార్ట్మెంట్ నుంచి పల్లె దావకాన డాక్టర్ స్వాతి ఏఎన్ఎం విద్యావతి విజయ,అంగన్వాడి టీచర్లు బుజ్జి , కమలమ్మ, లచ్చి ఆశా కార్యకర్త దానమ్మ వార్డ్ మెంబెర్స్, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం లయన్స్ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం

జయభేరి, దేవరకొండ :





లయన్స్ క్లబ్ ఆఫ్ దేవరకొండ ఆధ్వర్యంలో మండల పరిధిలోని వెంకటంపేట స్టేజి (దేన్యా నాయక్ తండా)లో ఉచిత కంటి, బీపీ షుగర్ పరీక్షల వైద్య శిబిరాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు.ప్రొఫెసర్ లయన్ రామావత్ రవి నాయక్ వారి సోదరులు తమ తండ్రిగారైన స్వర్గీయ రామావత్ పిత్యా నాయక్ జ్ఞాపకార్థం ఈ శిబిరానికి పూర్తి ఆర్థిక సహాయాన్ని అందించారు.శిబిరానికి విచ్చేసిన తండావాసులకు ఉచితంగా రక్తపోటు (BP), మధుమేహం (Sugar) పరీక్షలతో పాటు కంటి పరీక్షలు నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ దేవరకొండ ప్రెసిడెంట్ నారాయణరెడ్డి, సెక్రటరీ మల్లయ్య లకుమారపు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. హనుమాన్ నాయక్, బగ్గు నాయక్, హరి నాయక్, శ్రీను నాయక్, శంకర్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పిత్యా నాయక్ స్మారకార్థం సమాజ సేవకు ముందుకు వచ్చిన రవి నాయక్ కుటుంబ సభ్యులను వారు అభినందించారు. ఈ అవకాశాన్ని తండావాసులు చుట్టుపక్కల గ్రామస్థులు పెద్ద సంఖ్యలో వినియోగించుకున్నారు.



## ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

జయభేరి, తుర్కపల్లి, ఏప్రిల్ 21 :

తుర్కపల్లి మండలం ములకలపల్లి గ్రామ పరిధిలోని విశ్వభారత్ గ్లోబల్ స్కూల్లో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు. అనంతరం పాఠశాల కరస్పాండెన్స్ దశరథ గౌడ్ మాట్లాడుతూ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు క్రమశిక్షణతో మంచి విద్యను నేర్చుకొని విద్యా సంవత్సరాన్ని పూర్తి చేసుకున్నారని అన్నారు .రాబోవు కాలంలో మంచి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. విద్యార్థులు మంచిగా చదువుకొని పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ప్రతిమ, ఉపాధ్యాయులు లావణ్య, రామలీల, రాజేశ్వరి, శైలజ ,కల్పన, శిరీష, స్వీటీ రెడ్డి, కవిత, నవనీత, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏబీవీపీ ఆధ్వర్యంలో రాస్తారోకో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం




జయభేరి, తుర్కపల్లి, ఏప్రిల్ 21 :

తుర్కపల్లి మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ఏబీవీపీ ఆధ్వర్యంలో రాస్తారోకో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఎస్ ఉప్పు సాయికిరణ్ మాట్లాడుతూ విద్యార్థులకు పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్లను వెంటనే విడుదల చేయాలని ఎలక్షన్ సమయంలో మహిళలకు ఇచ్చినటువంటి హామీలను నెరవేర్చాలంటూ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డొంకెన్ వంశీ, మధు, కిరణ్, గుగులోతు వినోద్, బుల్య మౌళి, జాలిగాం అఖిల్ రామ్ చరణ్, పనగట్ల మహేష్, పత్తి సాయి, మహేష్, నవీన్, ఓర్సు వంశీ, లోకుల నిఖిల్ పాల్గొన్నారు.

## సర్కారీ బడి – పిల్లల ఒడి

- ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపాలి




జయభేరి, తుర్కపల్లి, ఏప్రిల్ 21 :

ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు కల్పిస్తున్నామని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రధానోపాధ్యాయుడు రాంపల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని, పాఠశాలల ప్రత్యేకతలు సదుపాయాల గురించి వివరిస్తూ ప్రభుత్వ పాఠశాలలో ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత ఏకరూప దృశ్యులు, సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, విశాలమైన తరగతి గదులు, విశాలమైన ఆటస్థలం, డిజిటల్ తరగతులు, సైన్స్ ల్యాబ్, గత సంవత్సరంలో పదవ తరగతి 100% ఉత్తీర్ణత గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించినట్టు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు చేయుటకు సానుకూలంగా స్పందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి జ్యోతి, ఎం సుజాత, బి హరిత, ఆర్ అంబాజీ, సిఆర్పి భాస్కర్ పాల్గొన్నారు.

## మలేరియా అంతం మన పంతం

- జిల్లా మలేరియా అధికారి నూకరాజు



జయభేరి, మద్దికేర:

మలేరియా అంతం చేయడమే మన పంతమని జిల్లా మలేరియా అధికారి నూకరాజు పేర్కొన్నారు.మలేరియా నివారణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా మలేరియా అధికారి నూకరాజు మద్దికేర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు.అనంతరం మాట్లాడుతూ సమాజ భాగ్యాస్వామ్యం తోనే మలేరియా నివారించవచ్చని, ప్రజలు ప్రతి శుక్రవారం ఫ్రైడేను డ్రైడే గా నిర్వహించాలని,పరిసరాల పరిశుభ్రత పాటించడం,నీటి నిల్వలు లేకుండా చూసుకోవడం,దోమలు పుట్టకుండా కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా మలేరియా నిర్మూలించవచ్చని,దీనికై ప్రజలు అవగాహన పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ శ్రీ లక్ష్మి, డాక్టర్ రాగిణి,సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు ,డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ అక్బర్ బాషా, ల్యాబ్ టెక్నీషియన్ విజయ కుమార్, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమ్మ, సూర్యనారాయణ హెల్త్ అసిస్టెంట్ విజయకుమార్,ఆరోగ్య సిబ్బంది,ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# 23న క్యాబినెట్ సమావేశం

- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా'ప్రారంభం పై చర్చ

జయభేరి, హైదరాబాద్ :

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 23న జరగనుంది. సచివాలయంలోని ఆరో అంతస్తులో గల క్యాబినెట్ మీటింగ్ హాల్‌లో మధ్యాహ్నం 3 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం ప్రారంభం కానుంది. సమావేశానికి అవసరమైన సమాచారంతో అందుబాటులో ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సోమవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో అన్ని శాఖల ముఖ్యకార్యదర్శులను ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 99 రోజుల 'ప్రజా పాలనప్రగతి ప్రణాళిక' కార్యక్రమం కొనసాగుతోంది. జూన్ 12న ముగియనున్న ఈ కార్యక్రమంలో భాగంగా జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం పలు నిర్ణయాలను ప్రకటించనుంది.

**క్యాబినెట్ భేటీలో చర్చించనున్న అంశాలు:**
జూన్ 2న 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం'ను ప్రారంభించే అవకాశాలున్నాయి. ఈసారి బడ్జెట్‌లో ఈ పథకాన్ని ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టింది. దీనికి రూ.4 వేల కోట్లను కూడా కేటాయించింది. రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున జీవిత బీమా సౌకర్యాన్ని వర్తింపజేయాలని నిర్ణయించింది. ఈ పథకం ప్రారంభ సాధ్యాసాధ్యాలను క్యాబినెట్‌లో పరిశీలించనున్నారు. మే నెలలో మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఓటర్ల తుది జాబితాను ఖరారు చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఎన్నికల సన్నద్ధతపై చర్చించే అవకాశాలున్నాయి.
గవర్నర్ కోటా కింద ప్రభుత్వం ఎమ్మెల్సీలుగా ప్రతిపాదించిన కోదండరాం, అజారుద్దీన్‌లపై గవర్నర్ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. సీఎం రేవంత్‌రెడ్డి..గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను కలిసి ప్రతిపాదనలను ఆమోదించాలని కోరారు.ఈ అంశం చర్చకు రావొచ్చు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న అంశం కూడా క్యాబినెట్‌లో చర్చకు వచ్చే అవకాశముంది. ఇప్పటికే ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ నేటి నుంచి సమ్మెకు దిగుతామని ప్రకటించింది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, పీఆర్సీ, డీఏలను ప్రకటించడం వంటి అంశాలను జేఏసీ లేవనెత్తుతోంది. ఈ సమస్యలపై క్యాబినెట్ చర్చించవచ్చని సమాచారం. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వానికి కొంత ఇబ్బందికరంగా మారాయి. పీఆర్సీ నివేదికను తెప్పించుకుని, ఫిట్‌మెంట్‌ను ప్రకటించాలని, పెండింగ్ డీఏలను విడుదల చేయాలంటూ ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేపట్టాయి. ఇప్పటికే ప్రభుత్వం ఉద్యోగుల బిల్లుల క్లియరెన్స్‌కు ప్రతి నెలా రూ.700 కోట్ల చొప్పున నిధులు విడుదల చేస్తోంది. అయినా,రిటైర్ అయిన ఉద్యోగులకు పూర్తి స్థాయి ప్రయోజనాలు అందడం లేదని సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఉద్యోగుల సమస్యలపై క్యాబినెట్ సమావేశంలో చర్చ జరుగుతుందని సంఘాల నేతలు చెబుతున్నారు. యాసంగి ధాన్యం సేకరణపై క్యాబినెట్ దృష్టి సారించనుంది. ధాన్యం, మొక్కజొన్నల సేకరణ ఎంత జరిగింది, ఇంకా రైతుల వద్ద ఎంత మేర ఉందన్న వివరాలను క్యాబినెట్ ఆరా తీయనుంది. వడగళ్ల వానతో జరిగిన పంట నష్టాలపై క్యాబినెట్ చర్చించనుంది. నిజామాబాద్ వంటి జిల్లాల్లో వడగళ్ల వాన కురిసి చేతికొచ్చిన వరి ధాన్యాన్ని రైతులు నష్టపోయారు. కళ్లాలు, రహదారులపై ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన కుల సర్వే వివరాలను ప్రభుత్వం బయటపెట్టింది. కులాలవారీగా జనాభా, ఆయా కులాల చేతుల్లో ఉన్న భూమి, పేదరికం వంటి వివరాలను బహిర్గతం చేసింది. ఈ నేపథ్యంలో ప్రజల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌పై క్యాబినెట్ చర్చించనుంది. మెట్రో రైలు మొదటి దశ ప్రాజెక్టును ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకోవడం, నిధుల చెల్లింపు అంశంతోపాటు కొత్తగా తీసుకురానున్న రోహిత్ వేముల వివక్ష నిరోధక చట్టంపై చర్చించే అవకాశాలున్నాయి.

# కోలీవుడ్లో లీకేజీల కలకలం




కోలీవుడ్లో లీకేజీల కలకలం ఆగడం లేదు. ఇటీవల విజయ్ 'జన నాయగన్' చిత్రం నుంచి కీలక సన్నివేశాలు బయటకు రావడం మరువకముందే, తాజాగా సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ సీక్వెల్ 'జైలర్ 2' సినిమాకు కూడా లీకుల బెడద తప్పలేదు. ఈ సినిమా షూటింగ్కు సంబంధించిన ఫుటేజీ ఆన్లైన్లో ప్రత్యక్షం కావడం తమిళ చిత్ర పరిశ్రమలో సంచలనం సృష్టిస్తోంది.ఈ అనూహ్య పరిణామంతో అప్రమత్తమైన నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ వెంటనే రంగంలోకి దిగింది. తమ యాంటీ పైరసీ బృందం సోషల్ మీడియాను నిరంతరం గమనిస్తోందని స్పష్టం చేసింది. లీకైన వీడియోలను షేర్ చేసినా, ప్రమోట్ చేసినా సంబంధిత సోషల్ మీడియా ఖాతాలపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఆ అకౌంట్లను శాశ్వతంగా తొలగిస్తామని వార్నింగ్ ఇచ్చింది. వరుసగా స్టార్ హీరోల సినిమాలకే ఇలాంటి అనుభవాలు ఎదురవుతుండటంతో కోలీవుడ్లో ఇప్పుడు ఈ అంశంపై తీవ్ర చర్చ జరుగుతోంది.

# ఘనంగా శ్రీ సరస్వతి విద్యా నికేతన్ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

- సంస్కృతిక ప్రదర్శనలతో అలరించిన విద్యార్థులు
- పలు రంగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెమొంటోలతో సత్కారం

జయభేరి, శామీర్ పేట్, ఏప్రిల్ 21 :

లాల్ గడి మలక్ పేట్ లోని శ్రీ సరస్వతి విద్యానికేతన్ హై స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఎంతో సంబురంగా జరిగాయి. విద్యార్థుల విద్యాభ్యాసంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా ఈ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు కొనసాగాయి. విద్యార్థుల జీవితంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టే ఈ వేడుకలు పాఠశాల ప్రాంగణాన్ని ఒక పండుగ వాతావరణంగా మలిచాయి. రంగురంగుల అలంకరణలు, వెలుగుల కాంతులు, ఆకర్షణీయమైన వేదికతో పాఠశాల మొత్తం ఉత్సాహంతో కళకళలాడింది. కాగా ఈ కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు సంప్రదాయ దుస్తువులు ధరించి అందరినీ అలరించారు . తమ విద్యా ప్రయాణంలో సాధించిన విజయాలను గుర్తుచేసుకుంటూ, స్నేహితులతో కలిసి ఫోటోలు దిగుతూ ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు.
అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రముఖులు విద్యార్థులకు ప్రేరణాత్మక




సందేశాలు అందించారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, పట్టుదలతో కృషి చేస్తే విజయాన్ని సాధించడం ఖాయం అని వారు స్పష్టం చేశారు . వైఫల్యాలకు భయపడకుండా వాటినే పాఠాలుగా మలచుకుని ముందుకు సాగితే విజయం తథ్యం అని వెల్లడించారు . విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత కూడా సమానంగా ముఖ్యమని వివరించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ కన్ రెడ్డి మాలతీ, కరస్పాండెంట్ కన్ రెడ్డి మాధవ్ రెడ్డి వారు మాట్లాడుతూ విద్యార్థుల కృషిని ప్రశంసిస్తూ, ఈ విజయాల వెనుక ఉపాధ్యాయుల అంకితభావం మరియు తల్లి దండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉందని తెలిపారు. పాఠశాల విద్యార్థులు కేవలం విద్యలోనే కాదు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా ప్రతిభ కనబరుస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు . విద్యార్థులు భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యలో, క్రీడల్లో, ఇతర కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మెమెంటోలు, పతకాలు, సర్టిఫికెట్లతో సత్కరించారు. అదేవిధంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రత్యేక పురస్కారాలు అందచేశారు. ఈ ఘనత సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షధ్వానాలతో అభినందించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభను ఉత్సాహభరితంగా మార్చాయి. సంప్రదాయ నృత్యాలు, ఆధునిక నృత్య ప్రదర్శనలు, సామాజిక సందేశాలతో కూడిన నాటికలు, మధురమైన పాటలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇక తల్లిదండ్రులు తమ పిల్లలు ఈ స్థాయికి చేరుకోవడం పట్ల గర్వంతో కళ్లలో ఆనందభాష్పాలు వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల కృషిని కొనియాడుతూ, పాఠశాల అందిస్తున్న విద్యా ప్రమాణాలను అభినందించారు. పిల్లల భవిష్యత్తు కోసం ఇలాంటి ప్రోత్సాహక కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంతో సరస్వతి విద్యానికేతన్ హై స్కూల్‌లో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకలు విద్యార్థుల జీవితంలో చిరస్మరణీయమైన అనుభూతిగా నిలిచాయి. ఈ వేడుకలు వారికి కొత్త ఆశలు, కొత్త లక్ష్యాలు, కొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపాయి. భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశిస్తూ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# వార్షికోత్సవ మహాసభను విజయవంతం చేయాలి

జయభేరి, తుర్కపల్లి, ఏప్రిల్ 21 :

సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం తొమ్మిదో వార్షికోత్సవ మహాసభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు అంబటి చెన్న కిష్టయ్య తెలిపారు. మంగళవారం తుర్కపల్లి మండల కేంద్రంలో గ్రామీణ వైద్యుల సంఘం వార్షికోత్సవ మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 28వ తేదీన యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా 9వ వార్షికోత్సవ మహాసభను నిర్వహిస్తున్నట్లు మండల, జిల్లా స్థాయిలో ఉన్న వైద్యులందరూ ఈ మహాసభకు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్



రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, మదర్ డైరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనురాగ జయంతి, జిల్లా ఎస్పీ ఆకాంక్ష యాదవ్, హాజరైతునట్లు గ్రామీణ వైద్యులు అధిక సంఖ్యలో హాజరై మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కందిగట్ల లక్ష్మయ్య గౌడ్, మండల అధ్యక్షుడు పెండెం రవి, ప్రధాన కార్యదర్శి దుగ్యాల రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు కసరబోయిన బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా నాయకుడు పవన్ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలి

- చౌడమ్మ గుట్ట శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో పవన్ కళ్యాణ్ కోసం ప్రత్యేక పూజలు
- జనసేన పార్టీ అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆరోగ్యరీత్యా త్వరగా కోలుకోవాలని ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన జనసేన నాయకుడు జరుపుల రాజు నాయక్

జయభేరి, షాద్ నగర్, ఏప్రిల్ 21 :




జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎల్లప్పుడూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని, ప్రజా సేవకుడు అనారోగరీత్యా త్వరగా కోలుకోవాలని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ చౌడమ్మ గుట్ట శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన జనసేన పార్టీ నాయకులు. ఈ సందర్భంగా జరుకుల రాజు నాయక్, జనసేన నాయకులు మాట్లాడుతూ... పవన్ కళ్యాణ్ ఆరోగ్యరీత్యా ఎల్లప్పుడు బాగుండాలని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఎల్లవేళల ఉండాలని కోరుకుంటూ అఖిల భారత చిరంజీవి యువత వేవస్థాపక అధ్యక్షులు రవణం స్వామి నాయుడు ఆదేశాల మేరకు అఖిల భారత చిరంజీవి యువత జిల్లా అధ్యక్షులు షాద్ నగర్ జనసేన పార్టీ సీనియర్ నాయకులు జరుపుల రాజు నాయక్ ఆధ్వర్యంలో స్వామి వారికి 100. తమలపాకుల పూజ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవన్ కళ్యాణ్ ఆరోగ్యరీత్యా త్వరగా కోలుకోవాలని ఆయన అన్నారు. జనసేన పార్టీ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రజా సేవ చేయాలని, స్వామి నాయుడు ఆదేశాలు మేరకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని అన్నారు.జనసేన మహేందర్ రెడ్డి , శంకర్ గౌడ్ , స్ఫూర్తి తో జనసేన పార్టీ ప్రతి గ్రామంలో పార్టీ బలోపేతం చేయడానికి ముందుంటాం అలాగే పవన్ కళ్యాణ్ ఆరోగ్యరీత్యా త్వరగా కోలుకోవాలని తెలంగాణ రాష్ట్రంలో సీనియర్ నాయకులు తో కలిసి చర్చించి సేవలు చేయాలని ఆ భగవంతుని కృపతో ప్రజా సేవకుడు పవనన్న ఆరోగ్యం బాగుండాలని భగవంతున్ని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, బాలరాజు, లింగం నాయక్, ప్రభు,బాబు, రవి,రాజేష్ నాయక్ ,శ్రీశైలం, శంకర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల తోడ్పాటు

- రాజాబొల్లారం లో సిసి కెమెరాలను ప్రారంభించిన మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి

జయభేరి, మేడ్చల్ :

రక్షణ కవచంగా నిఘా నేత్రాలు నిలుస్తాయని మేడ్చల్ ఏసిపి శంకర్ రెడ్డి, సీఐ సత్యనారాయణ అన్నారు.ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని 4 వార్డులో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సీసీ కెమెరాలను మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి, సీఐ సత్యనారాయణ, ఎస్ఐ మన్మధరావు తో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల భద్రతే ధ్యేయంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం స్థానికుల్లో భరోసాను నింపుతుందన్నారు. పోలీస్ అధికారులు ప్రజలను ఉద్దేశించి పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తం



గా ఉండాలని సూచించారు. సీసీ కెమెరాల నిఘా వల్ల దొంగతనాలకు అడ్డుకట్ట పడుతుందని, నేరస్థులను త్వరగా పట్టుకోవడానికి ఈ సాంకేతికత ఎంతో దోహదపడుతుందని వివరించారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, రోడ్డు నిబంధనలు పాటించాలని కోరారు.యువత అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని, గ్రామంలో ఎలాంటి సమస్య ఉన్నా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని పిలుపునిచ్చారు. గ్రామంలోని సమస్యలను మా దృష్టికి తీసుకువస్తే, మీకు పూర్తి సహకారం అందించడానికి మేము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ శాంతిరాజ్ నాయక్ గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం వార్డులో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. నిఘా వ్యవస్థ పనితీరును అధికారులు ప్రత్యక్షంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శాంతి రాజు నాయక్, ఎస్టీ సెల్ అధ్యక్షులు ఆకాష్ నాయక్ ఎంపీటీసీ రవి నాయక్, మాజీ సర్పంచ్ మంగ నాయక్ రామచంద్రనాయక్ సంతోష్ నాయక్ రాజ్ కుమార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దమనుషులు పాల్గొన్నారు.





# సొంత పార్టీకి చెందిన దివ్యాంగుల నేతపైనే


- నోరు పారేసుకున్న ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య క్షమాపణలు చెప్పకుంటే
- తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అందోళనలు యాదగిరిగుట్టలో విలేకరుల సమావేశంలో మాట్లాడిన కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు కొడిదెల నరేశ్ హెచ్చరిక

జయభేరి, యాదగిరిగుట్ట, ఏప్రిల్ 21 :

దివ్యాంగులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందజేసే వాహనాలను అర్హులకు అందజేయాలని కోరినందుకు వెళ్తే కనీసం వికలాంగుడినని, కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడినని చూడకుండా ఎమ్మెల్యే నోటికొచ్చినట్లు దూషించాడన్నారు. మంగళవారం ఆయన యాదగిరిగుట్ట పట్టణంలో విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు కొణిదెల నరేష్ మాట్లాడుతూ.. దివ్యాంగులకు ప్రత్యేకమైన వాహనాలను అందించేందుకు యాదాద్రి భువనగిరి జిల్లాకు 50 వాహనాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వీటిని ఆనర్హులకు అందజేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.
అర్హులైన దివ్యాంగులకు అందజేసేలా చూడాలని ప్రభుత్వ విప్ అయిలయ్యను కలిసేందుకు యత్నిస్తే ఇంట్లో ఉండి కూడా లేదని చెప్పించారన్నారు. హైదరాబాద్,యాదగిరిగుట్టలోని ఆయన ఇంటి చుట్టూ వందసార్లు తిరిగామన్నారు. గత డిసెంబర్ లో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం కార్యక్రమం ఆలేరులో నిర్వహించి ఆలేరు ఎమ్మెల్యేను ముఖ్య అతిథిగా ఆహ్వానిస్తే రాలేదన్నారు. ఈ కార్యక్రమానికి రూ.50వేల ఖర్చు కాగా ఇస్తామంటూ దాటవేస్తూ దివ్యాంగులకు రోజుకు పదిసార్లు తిప్పించుకున్నారు. ఆత్మగౌరవంతో బతికే తమపై ఆలేరు ఎమ్మెల్యే మాట్లాడిన తీరు తీవ్రమైన బాధను కలిగిస్తోందన్నారు. దివ్యాంగుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనంతుల ఎల్లారెడ్డి మాట్లాడుతూ కొణిదెల నరేశ పై ఆలేరు ఎమ్మెల్యే మాట్లాడిన తీరును ఖండిస్తున్నామన్నారు. దివ్యాంగుల వాహనాల పంపిణీ విషయంలో కలెక్టరేట్ లో సరైన సమాధానం రావడం లేదని, దీనిపై స్పందించాలని కోరడంలో తప్పేముందని ప్రశ్నించారు.
ఆలేరు ఎమ్మెల్యే దివ్యాంగులకు క్షమాపణలు చెప్పాలని,లేకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని అనంతుల ఎల్లారెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల హెల్పింగ్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు సింగారం రమేశ్,ఆలేరు మండల దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు జాలపు సిద్ధారెడ్డి, దివ్యాంగులు కారింగుల యాదగిరి,వంగాల రమేశ్, రాఘవుల యాదగిరి, శ్రీకాంత్,శ్రీను తదితరులు పాల్గొన్నారు.







# ఉప్పల్‌లో సన్‌రైజర్స్ హ్యాట్రిక్..!

సొంతగడ్డపై వరసగా మూడో మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తడాఖా చూపించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ(135 నాటౌట్) సుడిగాలి శతకంతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై మానసికంగా పైచేయి సాధించిన హైదరాబాద్.. ఇషాన్ మలింగ(432) విజృంభణతో ఘన విజయం సాధించింది. పవర్ హిట్టర్లతో నిండిన ఢిల్లీలో నితీశ్ రానా(57) అర్ధ శకతంతో పోరాడినా.. మిడిలార్డర్ మెరవలేదు. ఆఖర్లో హర్ష్ దూబే(312) తిప్పేయగా 195కే ఢిల్లీ ఫలితంగా పరిమితమవ్వగా.. ఇషాన్ సేన హ్యాట్రిక్ విజయం, ఎనిమిది పాయింట్లతో ప్లే ఆఫ్స్ బరిలో నిలిచింది.

ఐపీఎల్ 19లో సన్‌రైజర్స్ హైదరాబాద్ హ్యాట్రిక్ విజయంతో సొంత ప్రేక్షకులను అలరించింది. ఉప్పల్ స్టేడియంలో ఓపెనర్ అభిషేక్ శర్మ (135 నాటౌట్) ఊచ కోతతో భారీ స్కోర్ కొట్టిన సన్‌రైజర్స్‌ను బౌలర్లు మళ్లీ నిలబెట్టారు. తొలి మ్యాచ్ ఆడుతున్న మధుషంక ఓపెనర్ పథుమ్ నిశాంక(8)ను ఔట్ చేసి బ్రేకిచ్చాడు. కానీ, నితీశ్ రానా(57), కేఎల్ రాహుల్(37) దూకుడుగా ఆడి కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. స్పిన్నర్లు, పేసర్లను దీటుగా ఎదుర్కొన్న రానా బౌండరీలతో భయపెట్టాడు.

శివాంగ్ ఓవర్లో రెచ్చిపోయిన అతడు అర్ధ శతకంతో ఆశలు రేపినా. ఇషాన్ మలింగ(434) ఢిల్లీకి 11వ ఓవర్లో షాకిచ్చాడు. వరస బంతుల్లో రానాను, సూపర్ డెలివరీతో డేవిడ్ మిల్లర్(0)ను బౌల్డ్ చేసి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. హ్యాట్రిక్ బంతికి వికెట్ కాపాడుకున్న ట్రిస్టన్ స్టబ్స్(27).. సమీర్ రిజ్వీ()తో.. అప్పటికే అవసరమైన నెట్ రన్‌రేటు 15 దాటింది. రివర్స్ స్కూప్ షాట్లు ఆడుతూ బౌండరీలు సాధిస్తున్న స్టబ్స్‌ను మలింగ బోల్తా కొట్టించాడు. దాంతో, ఐదో వికెట్‌కు 59 రన్స్ భాగస్వామ్యానికి తెరపడింది.

18 బంతుల్లో 66 రన్స్ అవసరమవ్వగా.. మలింగ ఓవర్లో అనికేత్ క్యాచ్‌తో ఇంప్యాక్ట్ సబ్ అశుతోష్ శర్మ(14) పెవిలియన్ చేరాడు. అక్షర్ పటేల్ (2)సైతం విఫలమవ్వగా సన్‌రైజర్స్ 47 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ ఓపెనర్ అభిషేక్ శర్మ(135 నాటౌట్ : 68 బంతుల్లో 10 ఫోర్లు, 10 సిక్సర్లు) శివాలెత్తిపోయాడు. ఆరంభం నుంచి వీరకొట్టుడు ఆటతోఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్ల భరతం పట్టిన ఈ చిచ్చర పిడుగు ఐపీఎల్‌లో రెండో శతకంతో మెరిశాడు. ట్రావిస్ హెడ్(37) విఫలమైనా జోరు చూపిన అభిషేక్.. తన మార్క్ విధ్వంసంతో చెడుగుడు ఆడుకున్నాడు.

ఆఖర్లో క్లాసెన్(37 నాటౌట్) దంచేశాడు. ముకేశ్ కుమార్ వేసిన చివరి ఓవర్లో 4, 6, 4, 4 తో సన్‌రైజర్స్‌కు భారీ స్కోరందించాడు. అభిషేక్ మెరుపులకు ఇషాన్, క్లాసెన్ దూకుడు తోడవ్వగా సన్‌రైజర్స్ నిర్ణీత ఓవర్లలో 2 వికెట్ల నష్టానికే 242 రన్స్ కొట్టింది.



# గెలిస్తేనే నిలిచేది!

## నేడే భారత్, దక్షిణాఫ్రికా మూడో టీ20

దక్షిణాఫ్రికా పర్యటనలో సఫారీలతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడేందుకు వచ్చిన భారత మహిళల జట్టు.. బుధవారం కీలక మూడో టీ20 ఆడనుంది. ఇప్పటికే సిరీస్‌లో 02తో వెనుకబడ్డ హర్మన్‌ప్రీత్ కౌర్ సేన.. ఈ మ్యాచ్‌లో గెలిస్తేనే సిరీస్‌పై ఆశలు సజీవంగా ఉంటాయి. గత రెండు మ్యాచ్‌ల్లోనూ బ్యాటింగ్ వైఫల్యంతో పరాభవాలు మూటగట్టుకున్న ఉమెన్ ఇన్ బ్లూ.. నేటి పోరులో అయినా సత్తాచాటాలని భావిస్తున్నది. టాపార్డర్‌లో షెఫాలీ వర్మ మినహా మిగిలినవారంతా విఫలమవుతున్న నేపథ్యంలో మంధాన,రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్‌తో పాటు ఆల్‌రౌండర్ దీప్తి ఎలా ఆడతారనే దానిపై భారత విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి. మరోవైపు బంతితో పాటు బ్యాట్‌తోనూ జోరుమీదున్న సౌతాఫ్రికా.. జోహన్నెస్‌బర్గ్‌లోనే సిరీస్‌ను ముగించాలనే పట్టుదలతో ఉంది. భారత కాలమానం ప్రకారం రాత్రి 9.30 గంటలకు మ్యాచ్ ఆరంభమవుతుంది.

# అల్కరాజ్, సబలెంకాకు లారియస్ అవార్డులు

టెన్నిస్ యువ సంచలనం కార్లొస్ అల్కరాజ్ (స్పెయిన్), మహిళల టాప్ సీడ్ అరీనా సబలెంకా (బెలారస్) క్రీడల్లో అత్యంత ప్రతిష్టాత్మకమైన లారియస్ అవార్డులను గెలుచుకున్నారు. 2025లో రెండు గ్రాండ్‌స్లామ్ (ఫ్రెంచ్ ఓపెన్, యూఎస్)లను గెలుచుకోవడంతో పాటు ప్రపంచ నెంబర్‌వన్ ర్యాంకును దక్కించుకున్న అల్కరాజ్‌కు 'వరల్డ్ స్పోర్ట్‌స్‌మెన్ ఆఫ్ ది ఇయర్' అవార్డును సొంతం చేసుకున్నాడు. ఇక సబలెంకా.. నిరుడు యూఎస్ ఓపెన్‌ను నెగ్గడమే గాక ఆస్ట్రేలియా, ఫ్రెంచ్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచింది. ఆమెకు 'వరల్డ్ స్పోర్ట్స్ ఉమెన్ ఆఫ్ ది ఇయర్' అవార్డు దక్కింది. 'వరల్డ్ టీమ్ ఆఫ్ ది ఇయర్'గా ప్రముఖ ఫుట్‌బాల్ జట్టు పారిస్ సెయింట్ జర్మన్ (పీఎస్‌జీ) ఎంపికైంది. ఈ క్యాటగిరీలో పోటీపడ్డ భారత మహిళల జట్టుకు నిరాశ ఎదురైంది.



# కాజల్ ఎంట్రీకి రంగం సిద్ధం ?



నందమూరి నటసింహం బాలకృష్ణ ప్రస్తుతం తన కెరీర్‌లో గోల్డెన్ ఫేజ్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. అఖండ , వీరసింహారెడ్డి , భగవంత్ కేసరి వంటి వరుస విజయాలతో ఆయన స్టార్‌డమ్ మరింత పెరిగింది. ఈ వయసులో కూడా యంగ్ హీరోలకు పోటీగా వరుస సినిమాలను లైన్‌లో పెట్టడం బాలయ్య ప్రత్యేకతగా మారింది. ఇలాంటి సమయంలోనే మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేనితో బాలకృష్ణ మరోసారి జతకట్టడం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన "వీరసింహారెడ్డి" భారీ విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. ఇప్పుడు అదే జోష్‌తో "NBK 111" పేరుతో మరో ప్రాజెక్ట్ తెరకెక్కుతోంది. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సంగీత దర్శకుడు తమన్ మరోసారి బాలయ్య సినిమాకు సంగీతం అందించడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈ సినిమాలో హీరోయిన్ ఎంపిక ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మొదట లేడీ సూపర్ స్టార్ నయనతారను ఈ ప్రాజెక్ట్ కోసం ఎంపిక చేసినట్లు వార్తలు వచ్చాయి. అయితే స్క్రిప్ట్ మార్పులు, కాల్‌షీట్ సమస్యల కారణంగా ఆమె ఈ సినిమా నుంచి తప్పుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. దీంతో ఆమె స్థానంలో స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ పేరును పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. బాలయ్యకాజల్ కాంబినేషన్‌లో వచ్చిన "భగవంత్ కేసరి" బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ కావడంతో, అదే సెంటిమెంట్‌ను కొనసాగించాలని చిత్రబృందం భావిస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే కాజల్‌కు కథ చెప్పగా, ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.



# రానా భార్య సినిమాల్లోకి రాబోతుందా... మిహికా బజాజ్ క్లారిటీ ఇదే..!

టాలీవుడ్ హీరో రానా దగ్గుబాటి భార్యగా మిహికా బజాజ్ ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించుకుంది. ఇంటీరియర్ డిజైనర్‌గా, బిజినెస్ వుమన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మిహికా, సోషల్ మీడియాలో కూడా యాక్టివ్‌గా ఉంటూ భారీ ఫాలోయింగ్‌ను సంపాదించింది. సేవా కార్యక్రమాల్లో కూడా పాల్గొంటూ అందరి ప్రశంసలు అందుకుంటుంది. అయితే ఇటీవల మిహికా బజాజ్ సినిమాల్లోకి ఎంట్రీ ఇవ్వబోతుందన్న వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఓటీటీ షోల్లో పాల్గొనడం, సెలబ్రిటీలతో రెగ్యులర్‌గా కనిపించడం, వివిధ ఈవెంట్స్‌లో హాజరవ్వడం వంటి కారణాలతో ఈ రూమర్స్ మరింత ఊపందుకున్నాయి. ఇటీవల ఓ ఆర్ట్ కార్యక్రమంలో పాల్గొన్న మిహికా బజాజ్ ఈ విషయంపై స్పష్టత ఇచ్చింది. మీడియాతో మాట్లాడిన ఆమె, "నేను సినిమాల్లోకి రాను. సినిమాలపై, నటీనటులపై నాకు చాలా గౌరవం ఉంది. కానీ నటన అనేది ప్రత్యేకమైన ప్రతిభ. అది తెలిసిన వాళ్లు మాత్రమే చేయాలి" అని తెలిపింది. ఒకవేళ సినిమా రంగంలో పని చేసే అవకాశం వస్తే, నేను కెమెరా ముందు కాకుండా వెనుక పనిచేయడానికే ఇష్టపడతాను. డిజైనింగ్ రంగంలో నా ట్యాలెంట్‌ను చూపిస్తాను అంటూ తన అభిప్రాయాన్ని వెల్లడించింది. మిహికా వ్యాఖ్యలతో ఆమె సినిమాల్లో హీరోయిన్‌గా కనిపించే అవకాశం లేదని క్లారిటీ వచ్చింది. అయితే భవిష్యత్తులో ఆర్ట్ డిపార్ట్మెంట్ లేదా ప్రొడక్షన్ వంటి విభాగాల్లో పనిచేసే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. మొత్తానికి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న రూమర్స్‌కు చెక్ పెట్టిన మిహికా బజాజ్, తన దృష్టి పూర్తిగా తన కెరీర్ మరియు వ్యాపారాలపైనే ఉందని స్పష్టం చేసింది. ఇక రానా విషయానికి వస్తే ప్రస్తుతం హీరోగా, సపోర్టింగ్ క్యారెక్టర్స్‌లో మెరుస్తున్నాడు. ఈ మధ్య రానా నుండి ఆశిందగ్గ సినిమాలు రాలేదు. మంచి హిట్ కోసం భళ్లాలదేవుడు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నాడు.

# పూర్తికావచ్చిన పెద్ది



అగ్ర హీరో రామ్‌చరణ్ నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది'. జాన్వీ కపూర్ కథానాయిక. శివరాజ్‌కుమార్, జగపతిబాబు కీలక పాత్రధారులు. బుచ్చిబాబు సానా దర్శకుడు. వెంకటసతీశ్ కిలారు నిర్మాత. ఈ సినిమా షూటింగ్ పూర్తి కావచ్చింది. మరో 6రోజుల్లో గుమ్మడికాయ కొట్టేయనున్నట్టు మేకర్స్ మంగళవారం ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా సెట్స్ నుంచి విడుదలైన కొత్త స్టిల్స్ షూటింగ్ స్పాట్‌లోని పాజిటివ్ ఎనర్జీని సూచిస్తున్నాయి. స్టైలిష్ లుక్‌లో కనిపిస్తున్న రామ్‌చరణ్‌ని, ఆయనతో ఉన్న దర్శకుడు బుచ్చిబాబు సానాను ఈ పోస్టర్‌లో చూడొచ్చు. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. జూన్‌లో సినిమాను విడుదల చేయనున్నట్టు మేకర్స్ తెలియజేశారు. దివ్యేందు శర్మ, బొమన్ ఇరానీ ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఆర్.రత్నవేలు, సంగీతం: ఏఆర్ రెహమాన్, సహనిర్మాత: ఇషాన్ సక్సేనా, సమర్పణ: మైత్రీ మూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్స్, నిర్మాణం: వృద్ధి సినిమాస్.

# ఎట్టకేలకి జైలర్ 2 షూటింగ్ పూర్తి..

## రజనీకాంత్ అభిమానుల్లో పెరిగిన అంచనాలు



సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తున్న 'జైలర్ 2' సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రముఖ దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్ గురించి తాజాగా కీలక అప్‌డేట్ వెలువడింది. చిత్ర బృందం అధికారికంగా షూటింగ్ పూర్తయిందని ప్రకటించడంతో, అభిమానుల్లో ఉత్సాహం మరింత పెరిగింది. షూటింగ్ పూర్తయిన సందర్భంగా చిత్ర యూనిట్ కలిసి కేక్ కట్ చేసి సెలబ్రేషన్స్ జరుపుకుంది. ఈ సందర్భంగా బయటకు వచ్చిన ఫోటోలు, వీడియోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.

ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ దశలోకి ప్రవేశించింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా పూర్తి చేస్తే, సినిమా అనుకున్న సమయానికి ముందే విడుదలయ్యే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. అయితే ఇప్పటివరకు చిత్ర బృందం అధికారిక విడుదల తేదీని ప్రకటించలేదు. దీంతో అభిమానులు రిలీజ్ డేట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమాలో శివ రాజ్‌కుమార్, ఎస్.జే. సూర్య, మోహన్‌లాల్, రమ్య కృష్ణన్, మీర్నా మీనన్, యోగి బాబు వంటి పలువురు ప్రముఖులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. భారీ తారాగణంతో తెరకెక్కుతున్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకులను అలరించనుంది.

ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తుండగా, సంగీతాన్ని అనిరుధ్ రవిచందర్ అందిస్తున్నారు. ఇప్పటికే ఆయన సంగీతం సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని అభిమానులు భావిస్తున్నారు. అయితే 'జైలర్ 2' షూటింగ్ పూర్తవడంతో, ఇప్పుడు అందరి దృష్టి పోస్ట్ ప్రొడక్షన్ పనులు మరియు రిలీజ్ డేట్‌పై ఉంది. రజనీకాంత్ స్టైల్, నెల్సన్ మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్ కలయికలో ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధిస్తుందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# రెండు బ్రేకప్‌ల తర్వాత మనసు మార్చుకున్న శ్రుతి హాసన్



కోలీవుడ్ నుండి టాలీవుడ్ వరకు సినీ తారల పెళ్లి వార్తలు ఎప్పుడూ ఆసక్తి రేకెత్తిస్తూ ఉంటాయి. ఇప్పుడు ఈ చర్చ స్టార్ కిడ్ శృతి హాసన్ చుట్టూ తిరుగుతోంది. అప్పట్లో పెళ్లి వద్దే వద్దు అంటూ చెప్పిన ఈ బ్యూటీ, తాజాగా అరేంజ్డ్ మ్యారేజ్‌కు సిద్ధమవుతున్నట్లు వార్తలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. శృతి ఈ సడన్ మార్పుకు కారణం ఏమిటన్నది చర్చనీయాంశంగా మారింది. కోలీవుడ్ వర్గాల నుండి అందుతున్న సమాచారం ప్రకారం, రెండు ప్రేమ వ్యవహారాలలో బ్రేకప్‌లు ఎదుర్కొన్న శృతి హాసన్, ఇప్పుడు ప్రేమ వివాహాలకు స్వస్తి పలికి అరేంజ్డ్ మ్యారేజ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆమె తండ్రి కమల్ హాసన్ నిర్ణయమే తనకు ఫైనల్ అని చెప్పినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సినిమాలను తగ్గించేసిన శృతి, తన వ్యక్తిగత జీవితంపై దృష్టి సారించినట్లు సమాచారం.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**